TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 90 | హైదరాబాద్ | శుక్రవారం 18-09-2026 | పేజీలు: 08

## చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు

తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న కిషన్ రెడ్డి

రజాకార్ల ఘోరాలను గత పాలకులు తొక్కిపెట్టారని మండిపాటు

ఎంఐఎంకు అనుకూలంగా రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని విమర్శ

ప్రజాక్షేత్రం, హైదరాబాద్

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన 'తెలంగాణ విమోచన దినోత్సవం' వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలపై విరుచుకుపడ్డారు. తెలంగాణలో రజాకార్లు జరిపిన నరమేధం, ఘోరాలను గత పాలకులు చరిత్ర పుటల నుంచి తొక్కిపెట్టారని మండిపడ్డారు. చరిత్రను ఎంత దాచాలని చూసినా సత్యం దాగిపోదని స్పష్టం చేశారు. ఎంఐఎంకు భయపడే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా మిగతా 2లో..



## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ

భూముల వివరాల సేకరించిన అధికారులు

ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంపై రెవెన్యూ అధికారుల దృష్టి

భూముల వివరాలను సిద్ధం చేస్తున్న అధికారులు

ప్రభుత్వ భూముల సర్వే నంబర్ల సేకరణ

గతంలో భూములు కలిగి ఉన్న రైతుల వివరాలు

ప్రస్తుత రెవెన్యూ రికార్డుల పరిశీలన

నివేదికల రూపంలో వివరాల తయారీ

సిద్ధిపేట జిల్లా మర్కుక్ మండలంలో ప్రక్రియ

ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి సమీపంలోని భూములపై ఆరా

అసెంబ్లీలో ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించినట్లు వెల్లడి

విచారణ నేపథ్యంలో అధికారుల కసరత్తు

ప్రజాక్షేత్రం, హైదరాబాద్

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్‌కు సంబంధించిన వ్యవసాయ క్షేత్రంపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. వ్యవసాయ క్షేత్రానికి సమీపంలో ఉన్న భూములకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ప్రభుత్వ భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, గతంలో ఆయా భూములను కలిగి ఉన్న రైతుల పేర్లు, ప్రస్తుతం ఉన్న రెవెన్యూ రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ వివరాలను నివేదికల మిగతా 2లో..



## మా కుటుంబ ఆస్తులు.. రేవంత్ ఆస్తులపై విచారణకు సిద్ధమా?

### కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందనడంపై కేటీఆర్ ఆగ్రహం

మాజీ సీఎంకు ఉన్నది 67 ఎకరాలేనని స్పష్టం

పుట్టుక నుంచి తమ ఆస్తులపై విచారణకు సిద్ధమని ప్రకటన

మీ ఆస్తులపైనా విచారణకు సిద్ధమా అంటూ రేవంత్‌కు సవాల్

సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్

ప్రజాక్షేత్రం, హైదరాబాద్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబ ఆస్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌కు 1,000 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ముఖ్యమంత్రి విషప్రచారం చేస్తున్నారని, ఇందుకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

కేసీఆర్‌కు ఉన్నది 1,000 ఎకరాలు కాదని, కేవలం 67 ఎకరాలు మాత్రమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రే అసెంబ్లీ వేదికగా అంగీకరించారని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ముఖ్యమంత్రికి ఓ సవాల్ విసిరారు. "కేసీఆర్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మా కుటుంబం ఆస్తులపై పూర్తిస్థాయి విచారణకు మేము సిద్ధం. మరి పుట్టినప్పటి నుంచి మీ ఆస్తులపై విచారణకు మీరు సిద్ధమా?" అని రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ వ్యవసాయాన్ని ప్రేమించే నిజమైన రైతు అని, ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ ఆయన సాగు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కొందరు భూమిని ఒక వ్యాపార వస్తువుగా చూస్తే, కేసీఆర్ మాత్రం దానిని ఎంతో పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. చట్టబద్ధంగా కొనుగోలు మిగతా 2లో..





## మెల్‌బోర్న్‌లో రోడ్డు ప్రమాదం

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

ప్రమాదంలో ఇద్దరు విశాఖవాసులు మృతి

జీటీ ప్రసాద్ కుటుంబంలో విషాదం

శుభకార్యంలో పాల్గొనేందుకు ఆస్ట్రేలియా వెళ్లిన కుటుంబం

ప్రసాద్ భార్య, కోడలు నేహా మృతి

కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

కళ్లెదుటే భార్య, కోడలు మృతి చెందడంతో ప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతి

గతంలో వీడీసీఏలో జాయింట్ సెక్రటరీగా పనిచేసిన ప్రసాద్

ప్రమాద ఘటనతో విశాఖలో విషాదం

సుమారు పది రోజుల తర్వాత మృతదేహాలు విశాఖకు చేరే అవకాశం

ప్రజాక్షేత్రం, నేషనల్‌బ్యూరో

ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విశాఖవాసులు మృతి చెందారు. విశాఖకు చెందిన జీటీ ప్రసాద్ తన కుటుంబంతో కలిసి శుభకార్యంలో పాల్గొనేందుకు ఆస్ట్రేలియా వెళ్లారు. మెల్‌బోర్న్‌లో వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో జీటీ ప్రసాద్ భార్య, ఆయన కోడలు నేహా మృతి చెందారు. కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడినట్లు మిగతా 2లో..

## యూట్యూబర్ వైష్ణవి భర్త దారుణహత్య

కత్తులతో నరికిచంపిన దుండగులు

నిజామాబాద్‌లో హరిబాబు దారుణ హత్య

ఆర్ఆర్ చౌరస్తా వద్ద నడిరోడ్డుపై దాడి

కారులో వెళ్తుండగా కత్తులతో దాడి

గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్య

తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి

ఇటీవలే బెయిల్‌పై జైలు నుంచి విడుదల

గతంలో భార్య వైష్ణవి హత్య కేసులో అరెస్టు

వైష్ణవి హత్య కేసులో నిందితుడిగా హరిబాబు

పగతోనే హత్య జరిగి ఉండొచ్చని పోలీసుల అనుమానం

సీసీటీవీ ఆధారంగా నిందితుల కోసం గాలింపు



ప్రజాక్షేత్రం, నేషనల్‌బ్యూరో

నిజామాబాద్‌లో యూట్యూబర్ వైష్ణవి భర్త హరిబాబు దారుణ హత్యకు గురయ్యాడు. ఆర్ఆర్ చౌరస్తా వద్ద కారులో వెళ్తున్న హరిబాబుపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన హరిబాబు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

హరిబాబు గతంలో జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ప్రముఖ యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. గర్భవతిగా ఉన్న వైష్ణవిని అదనపు కట్నం కోసం 2026 మార్చిలో మిగతా 2లో..

## ప్రజల ఆశీర్వాదమే నాకు శ్రీరామరక్ష

76వ పుట్టినరోజు సందర్భంగా వెల్లువెత్తిన శుభాకాంక్షలు

ప్రజల ప్రేమాభిమానాలకు మోదీ కృతజ్ఞతలు

'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమంపై ప్రధాని స్పందన

మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని గుర్తుచేస్తూ ప్రత్యేక గీతం

మోదీ జన్మదినం సందర్భంగా పాట విడుదల

దేశవ్యాప్తంగా 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమానికి బీజేపీ పిలుపు



ప్రజాక్షేత్రం, హైదరాబాద్

ప్రధాని నరేంద్ర మోదీ తన 76వ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా అందుతున్న శుభాకాంక్షలపై స్పందించారు. ప్రజలు చూపుతున్న ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ చేపట్టిన 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమంపై మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందుతున్న ఆశీర్వాదాలు దేశసేవ పట్ల తన సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని గాయని స్నేహా శంకర్, కళాకారుడు అమన్ పంత్ 'ఆశీర్వాద్ కా దియా' ప్రత్యేక గీతాన్ని రూపొందించారు. మోదీ జన్మదినంతో పాటు ఆయన 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని గుర్తుచేస్తూ ఈ పాటను అంకితం చేశారు. దీనిపై స్పందించిన ప్రధాని.. ప్రజల నుంచి లభిస్తున్న ఆశీర్వాదాలు దేశానికి సేవ చేయాలన్న తన నిబద్ధతను మరింత పెంచుతాయని అన్నారు. మోదీ పుట్టినరోజు సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రజలు 'ఆశీర్వాద్ కా దియా' మిగతా 2లో..

## ఉద్యమకారులకు అప్పులు .. కేసీఆర్ కుటుంబానికి ఆస్తులు

బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శలు

ఉద్యమకారుల త్యాగాల పునాదులపై ఆస్తులు సంపాదించారని ఆరోపణ

ఉద్యమకారులకు ఆస్తులు తగ్గితే.. కేసీఆర్‌కు లక్షల కోట్ల ఆస్తులు వచ్చాయని వ్యాఖ్య

2004 వరకు కేసీఆర్‌కు ఒక్క ఎకరా భూమి లేదని వెల్లడి

ఎన్నికల అఫిడవిట్‌లోనూ ఇదే విషయాన్ని పేర్కొన్నారని వ్యాఖ్య

ఇప్పుడు కేసీఆర్‌కు వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్న

కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాలు ఉన్నాయన్న కేటీఆర్ వ్యాఖ్యలపై అభ్యంతరం

అఫిడవిట్‌లో తప్పలు రాశారా.. ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా? అని ప్రశ్న

ఎన్నికల అఫిడవిట్ ద్వారా కల్వకుంట్ల కుటుంబం అడ్డంగా దొరికిందని విమర్శ



ప్రజాక్షేత్రం, హైదరాబాద్

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ ఉద్యమకారులకు అప్పులే మిగిలాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉద్యమకారుల త్యాగాల పునాదులపై కేసీఆర్ కుటుంబం భారీగా ఆస్తులు సంపాదించిందని ఆరోపించారు. ఉద్యమకారుల ఆస్తులు తగ్గిపోయిన సమయంలో కేసీఆర్‌కు మాత్రం లక్షల కోట్ల ఆస్తులు వచ్చాయని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వంపై మిగతా 2లో..

## టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్‌కు మరో ఐదేళ్లు



టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ కొనసాగింపు

మరో ఐదేళ్ల పదవీకాలానికి బోర్డు ఆమోదం

ముంబయిలో జరిగిన బోర్డు సమావేశంలో నిర్ణయం

ప్రస్తుత పదవీకాలం ముగిసిన తర్వాతా కొనసాగనున్న చంద్రశేఖరన్

ఆగస్టు 12న తప్పుకోవాలనుకుంటున్నట్లు ప్రకటించిన చంద్రశేఖరన్

మారిన పరిస్థితుల నేపథ్యంలో పునర్నియామకానికి నిర్ణయం

ఆర్‌బీఐ నిబంధనలను పరిగణనలోకి తీసుకున్న ఎన్ఆర్‌సీ

పునర్నియామక తీర్మానానికి నోయెల్ టాటా వ్యతిరేక ఓటు

టాటా సన్స్ ఐపీఓ అంశంపై విభేదాలు

2017 నుంచి టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ సేవలు

ప్రజాక్షేత్రం, నేషనల్‌బ్యూరో

టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పదవీకాలాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ సంస్థ బోర్డు నిర్ణయం తీసుకుంది. గురువారం ముంబయిలోని బాంబే హౌస్‌లో జరిగిన టాటా సన్స్ బోర్డు సమావేశంలో ఈ మేరకు ఆమోదం తెలిపింది.

ఈ ఏడాది ఆగస్టు 12న చంద్రశేఖరన్ తన ప్రస్తుత పదవీకాలం పూర్తయిన మిగతా 2లో..

## సెప్టెంబర్ 17పై కాంగ్రెస్, బీజేపీవన్నీ అబద్ధాలే..

సెప్టెంబర్ 17 సందర్భంగా జెండా ఆవిష్కరించిన కవిత

తెలంగాణ పోరాట స్ఫూర్తిని గుర్తుచేసిన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి

కాంగ్రెస్, బీజేపీలపై కవిత విమర్శలు

విలీన చరిత్రను వక్రీకరిస్తున్నాయని ఆరోపణ

మతాలకు అతీతంగా ప్రజలు పోరాడారని వెల్లడి

ప్రజాక్షేత్రం, హైదరాబాద్

తెలంగాణ విలీన పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అరాచక శక్తులను గద్దె దించుతామని తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని బంజారా హిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 అనేది తెలంగాణ పౌరుషానికి, పోరాట పటిమకు మరియు త్యాగాల చరిత్రకు నిదర్శనం అన్నారు. అయితే ఈ చారిత్రక రోజుపై కాంగ్రెస్, బీజేపీలు మిగతా 2లో..



# మెల్‌బోర్న్‌లో రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

సమాచారం. తన కళ్లెదుటే భార్య, కోడలు ప్రమాదంలో మృతి చెందడంతో ప్రసాద్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.
జీటీ ప్రసాద్ గతంలో విశాఖ జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ)లో జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. ఆయన కుటుంబంలో చోటుచేసుకున్న విషాద ఘటనతో విశాఖలోని బంధువులు, సన్నిహితుల్లో విషాదం నెలకొంది.
ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం.

## మా కుటుంబ ఆస్తులు.. రేవంత్ ఆస్తులపై విచారణకు సిద్ధమా?

మొదటిపేజీ తరువాయి

చేసిన భూములపై అనవసర రాద్ధాంతం చేస్తూ రేవంత్ రెడ్డి 'సెల్ఫ్ గోల్' చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు.
కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల ఆస్తి ఉండేదని, చింతమడకలోని తమ పాత ఇంటిని ప్రభుత్వ పాఠశాల కోసం విరాళంగా ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. 22ఏ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడతామని ఆయన పునరుద్ఘాటించారు.

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ

మొదటిపేజీ తరువాయి

రూపంలో సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించినట్లు పేర్కొంటున్న నేపథ్యంలో అధికారులు ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంపై దృష్టి సారించారు. ఈ క్రమంలో భూములకు సంబంధించిన పాత, ప్రస్తుత రికార్డులను సేకరించే ప్రక్రియ కొనసాగుతోంది.

## యూట్యూబర్ వైష్ణవి భర్త దారుణహత్య

మొదటిపేజీ తరువాయి

కత్తితో పొడిచి హత్య చేసినట్లు అతడిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో పోలీసులు హరిబాబును అరెస్టు చేసి జైలుకు పంపించారు.ఇటీవల హరిబాబు కోర్టు నుంచి బెయిల్ పొందడంతో జైలు నుంచి బయటకు వచ్చాడు. బెయిల్‌పై ఉన్న సమయంలోనే ఆర్ఆర్ చౌరస్తా వద్ద గుర్తు తెలియని దుండగులు అతడిపై కత్తులతో దాడి చేసి హతమార్చారు.
భార్య వైష్ణవిని హత్య చేసినందుకు పగతోనే ఆమె కుటుంబ సభ్యులు లేదా బంధువులు హరిబాబును హత్య చేసి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్న పోలీసులు.. నిందితులను గుర్తించి పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

## టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్‌కు మరో ఐదేళ్లు

మొదటిపేజీ తరువాయి

తర్వాత మూడోసారి ఛైర్మన్‌గా కొనసాగాలనే ఉద్దేశం లేదని ప్రకటించారు. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు, మారిన పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న నామినేషన్ అండ్ రెమ్యూనరేషన్ కమిటీ (ఎన్ఆర్సీ) ఆయనను మరోసారి బాధ్యతలు స్వీకరించాల్సిందిగా కోరింది.
చంద్రశేఖరన్ పునర్నియామకానికి సంబంధించిన తీర్మానంపై టాటా ట్రస్ట్స్ ఛైర్మన్, టాటా సన్స్ బోర్డు డైరెక్టర్ నోయెల్ టాటా మాత్రమే వ్యతిరేకంగా ఓటు వేసినట్లు ఫైల్లోని సమాచారం పేర్కొంది.
టాటా సన్స్ కంపెనీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయడంపై కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు సమాచారం. నోయెల్ టాటా ఐపీఓను వ్యతిరేకిస్తుండగా.. టాటా సన్స్‌లో దాదాపు 18 శాతం వాటా ఉన్న షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ కంపెనీ లిస్టింగ్‌కు అనుకూలంగా ఉన్నట్లు పేర్కొంది.
2017 నుంచి టాటా సన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్ సేవలందిస్తున్నారు. ఆయన నాయకత్వంలో టాటా గ్రూప్ మరింత విస్తరించిందని, బోర్డులో మెజారిటీ సభ్యులు ఆయన కొనసాగింపునకు మద్దతు తెలిపినట్లు ఫైల్లో పేర్కొన్నారు.

## ప్రజల ఆశీర్వాదమే నాకు శ్రీరామరక్ష


మొదటిపేజీ తరువాయి

కార్యక్రమాన్ని నిర్వహించాలని బీజేపీ పిలుపునిచ్చింది. సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల మధ్య ఇళ్లలో దీపాలు వెలిగించి ప్రధాని ఆయురారోగ్యాలు, విజయాన్ని ఆకాంక్షించాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విజ్ఞప్తి చేశారు. ప్రజాసేవే దేశసేవ అనే సూత్రంతో మోదీ పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.
ఇదిలా ఉండగా.. మోదీ పుట్టినరోజు సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్' పేరుతో నెల రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని బీజేపీ చేపట్టింది. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. రక్తదాన శిబిరాలు, పరిశుభ్రత కార్యక్రమాలు, ప్రదర్శనలు, సదస్సులు, ప్రజా సంబంధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఫైల్లో పేర్కొన్నారు.

## చరిత్రను ఎవరూ దాచిపెట్టలేరు

మొదటిపేజీ తరువాయి

నిర్వహించడానికి వెనుకాడాయని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం ఎంఐఎంకు అనుకూలంగా ఓటు బ్యాంక్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా నిజాం పాలకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పొగడటాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "నిజాం నిజంగానే మంచివాడైతే తెలంగాణ విమోచన కోసం సాయుధ పోరాటాలు ఎందుకు చేయాల్సి వచ్చింది? 'ఆపరేషన్ పోలో' ఎందుకు చేపట్టాల్సి వచ్చింది?" అని నిలదీశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ఈ తరహా ఓటు బ్యాంక్ రాజకీయాలకు రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



# ఉద్యమకారులకు అప్పులు.. కేసీఆర్ కుటుంబానికి ఆస్తులు

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలకు పొంగులేటి ఈ మేరకు స్పందించారు.
2004 వరకు కేసీఆర్‌కు ఒక్క ఎకరా భూమి కూడా లేదని పొంగులేటి పేర్కొన్నారు. ఈ విషయాన్ని కేసీఆర్ స్వయంగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారని తెలిపారు. ప్రస్తుతం కేసీఆర్‌కు వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్ ద్వారా కల్వకుంట్ల కుటుంబం అడ్డంగా దొరికిపోయిందని వ్యాఖ్యానించారు.
కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల భూమి ఉన్న వ్యక్తి అని కేటీఆర్ చెబుతున్నారని పొంగులేటి అన్నారు. అదే నిజమైతే ఎన్నికల అఫిడవిట్‌లో కేసీఆర్ తన ఆస్తుల వివరాలను తప్పుగా నమోదు చేశారా? లేక ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా? అని ప్రశ్నించారు.
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను ప్రస్తావిస్తూ.. వారి త్యాగాల పునాదులపై రూ.లక్షల కోట్ల ఆస్తులు సంపాదించారని పొంగులేటి ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యమకారులకు ఆర్థికంగా ప్రయోజనం కలగలేదని, అప్పులే మిగిలాయని విమర్శించారు.



## సెప్టెంబర్ 17 పై కాంగ్రెస్, బీజేపీవన్నీ అబద్ధాలే..

మొదటిపేజీ తరువాయి

తమ రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

**కాంగ్రెస్, బీజేపీలపై ఘాటు విమర్శలు:**
సెప్టెంబర్ 17 చరిత్రను కాంగ్రెస్, బీజేపీలు వక్రీకరిస్తున్నాయని కవిత విమర్శించారు. స్టేట్ కాంగ్రెస్ పోరాటం వల్లే తెలంగాణ విలీనమైందని సీఎం అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. నిజానికి సంస్థానాల్లో పోరాటం చేయడం తమ విధానం కాదని నాడు గాంధీజీ అన్నారని కవిత గుర్తుచేశారు. నిజాం సర్కార్ పేదలకు ఇచ్చిన 10 లక్షల ఎకరాల భూమిని, భారత యూనియన్‌లో కలిశాక తిరిగి జమీందార్లకు అప్పగించిందే కాంగ్రెస్ అని ఆరోపించారు. ఇక ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటమని బీజేపీ మత రంగు పులిమే ప్రయత్నం చేస్తోందని కవిత ధ్వజమెత్తారు. ఆనాటి పోరాటంలో అసలు బీజేపీ, ఆర్ఎస్ఎస్ లేనే లేవని స్పష్టం చేశారు.


**ప్రజలే తుపాకీ పట్టి పోరాడారు:**
ఆనాటి జాగీర్‌దార్లు, జమీందార్ల దాష్టీకాలకు వ్యతిరేకంగా మతాలకు అతీతంగా ప్రజలే స్వచ్ఛందంగా పోరాడారని కవిత తెలిపారు. వట్టికోట ఆళ్వార్ స్వామి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి లాంటి మహనీయులు సైకిళ్లపై తిరుగుతూ ప్రజల్లో చైతన్యం నింపారని గుర్తుచేశారు. కాళోజీ, దాశరథి, షోయాబుల్లాఖాన్, మగ్దూం మొయినోద్దీన్ వంటి కవులు, రచయితలు సమరశంఖం పూరించారని కొనియాడారు. వారి చైతన్యంతోనే దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ, మల్లు స్వరాజ్యం, అరుట్ల కమలాదేవి లాంటి వీరులు ఉద్భవించారని పేర్కొన్నారు. నాడు మహనీయులు చూపిన పోరాట స్ఫూర్తితోనే, ప్రస్తుతం కులమతాలకు అతీతంగా ప్రజల హక్కులను కాపాడేందుకు తెలంగాణ రక్షణ సేన ముందుకు వచ్చిందని, అరాచక పాలనకు అంతం పలికే వరకు పోరాటం కొనసాగుతుందని కవిత అన్నారు.




## సంగాయిపల్లి తాండకు సంపంగి పండుగ వాతావరణం.

- **గిరిజనుల ఆత్మగౌరవం కోసం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు చారిత్రాత్మకం**
- **మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి.**

**యాలాల సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**
గిరిజనుల సంక్షేమం,తండాల అభివృద్ధి కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలకు గుర్తుగా యాలాల మండలం సంగాయిపల్లి తండాలో గురువారం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తండావాసులు,బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలతో కలిసి తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ తండాలో పుట్టిన బిడ్డకు తన తండానే పంచాయతీ కావాలనే ఆకాంక్షను నెరవేర్చిన ఘనత కేసీఆర్ దే. గిరిజనులకు హక్కులు, ఆత్మగౌరవంతో కూడిన పాలన అందించాలనే ఆలోచనతో కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుంది అని అన్నారు.
తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం ద్వారా గిరిజనులకు స్థానిక పాలనలో భాగస్వామ్యం కల్పించినట్లు పేర్కొన్నారు. 500కుపైగా జనాభా ఉన్న ఎస్టీ ఆవాసాలను గ్రామ పంచాయతీలుగా మార్చినట్లు తెలంగాణ ప్రభుత్వ పత్రాలు కూడా పేర్కొంటున్నాయి.
గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన నిర్ణయం గిరిజన యువతకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలను పెంచే ఉద్దేశంతో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయంగా ఆయన పేర్కొన్నారు. 2022 సెప్టెంబర్ 30న దీనికి సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది అని పైలెట్ రోహిత్ రెడ్డి తెలిపారు.
మా తండాలో మా పాలన అనే గిరిజనుల ఆకాంక్షకు అనుగుణంగా తండాలు, గూడెంలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు.
గిరిజన విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ విద్యా సంస్థల విస్తరణకు గత ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని, రాష్ట్రంలో గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ సంస్థల సంఖ్య గణనీయంగా పెరిగిందని అధికారిక గణాంకాలు చూపిస్తున్నాయని తెలిపారు.
గిరిజనుల విద్య, ఉపాధి, వ్యవసాయం, మౌలిక వసతులు, సంక్షేమం కోసం పలు కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన వివరించారు. గిరిజనుల కోసం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు కేవలం పథకాలు కాదు.. వారి ఆత్మగౌరవానికి గుర్తులు అని అన్నారు.
ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సి. రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి సిద్రాల శ్రీనివాస్, మండల ప్రచార కమిటీ సభ్యులు గణేష్ ముదిరాజ్, నాయకులు జే. శ్రీనివాస్ గౌడ్,అంజయ్య గౌడ్,హాజీపూర్ రవికుమార్, సుఖ్య నాయక్,డాక్య నాయక్, నారాయణ రాథోడ్, రమేష్, రాజు,విక్రాంత్,నారాయణ, తార్య నాయక్, గణేష్, తండావాసులు,బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు

విశ్వకర్మ సేవలు చిరస్మరణీయం

శంషాబాద్ సెప్టెంబర్17 (ప్రజాక్షేత్రం):
ప్రపంచపు తొలి వాస్తు శిల్పి , సృష్టికర్తగా పేర్కొన్న విశ్వకర్మ భగవానుడి జయంతి వేడుకలను గురువారం శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో శ్రీ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు వడ్ల మాధవచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
జయంతి సందర్భంగా నర్కుడ గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి గ్రామంలోని పలు ప్రధాన వీధుల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు.విశ్వకర్మ భగవాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది.
ఈ కార్యక్రమంలో నర్కుడ గ్రామ శ్రీ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఉపాధ్యక్షులు కమ్మరి ప్రకాష్ చారి,సుదర్శన్ చారి, శ్రీశైలం చారి,నరసింహ చారి, ప్రభు చారి,హరీష్ చారి,ప్రశాంత్ చారి,వడ్ల సిద్ధులు చారి,అఖిల్ జంగా చారి,ప్రవీణ్ చారి,రాము చారి,రాజు చారి తదితరులు పాల్గొన్నారు.

## రుణ లక్ష్యాలు సాధించాలి

- **గృహ, ఎంఎస్ఎంఈ రుణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**
- **మహిళా సంఘాల సభ్యులకు బీమా వర్తింపజేయాలి**
- **బ్యాంకర్లకు**
- **కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**

**వనపర్తి,సెప్టెంబరు 17 (ప్రజాక్షేత్రం):**
జిల్లాలో బ్యాంకులు నిర్దేశించిన వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను గడువులోగా సాధించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన 2026-27 మొదటి త్రైమాసిక జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ, సంప్రదింపుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.

**రూ.5,990.50 కోట్ల లక్ష్యం..**
జిల్లాకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.5,990.50 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యంగా నిర్ణయించగా.. జూన్ 30 నాటికి రూ.1,366.47 కోట్ల రుణాలు మాత్రమే మంజూరై, గ్రౌండింగ్ అయినట్లు అధికారులు వివరించారు. ఎంఎస్ఎంఈ, విద్య, గృహ రుణాల మంజూరు ఆశించిన స్థాయిలో లేదని కలెక్టర్ పేర్కొన్నారు. లక్ష్యాలను సాధించేలా బ్యాంకర్లు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

**గృహ రుణాలపై ప్రత్యేక శ్రద్ధ**
జిల్లాలో గృహ రుణాల లక్ష్యం కేవలం 12.47 శాతం మాత్రమే సాధించడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు బ్యాంకులు ఉదారంగా రుణాలు అందించాలని సూచించారు. గృహ రుణాల లక్ష్య సాధనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని లీడ్ బ్యాంకు మేనేజర్‌ను ఆదేశించారు.
ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనలను ప్రతి ఖాతాదారుడికి వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళా సమాఖ్య సభ్యులందరినీ బీమా పరిధిలోకి తీసుకొచ్చి 100 శాతం లక్ష్యం సాధించాలని ఆదేశించారు.
స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు అనుసంధాన రుణాలను సకాలంలో మంజూరు చేయాలని, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎంఎస్ఎంఈ రుణాలను విస్తృతంగా అందించి జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడాలని, పీఎం విశ్వకర్మ పథకాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఆర్‌సెటి ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రజలు, ఉద్యోగులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.
సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్,లీడ్ బ్యాంకు మేనేజర్ శివకుమార్,ఆర్‌బీఐ ఏజీఎం వి. ప్రదీప్ చంద్ర,యూబీఐ డీజీఎం డి.వెంకటేశ్వర్లు,ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్,జిల్లా అధికారులు,వివిధ బ్యాంకుల శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.



# పార్టీలైన్ దాటితే క్రమశిక్షణ చర్యలే

- కాంగ్రెస్ శ్రేణులు పార్టీ ఆదేశాలను తప్పక పాటించాలి
- డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి
- ప్రజాపాలన దినోత్సవం జిల్లా కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ
- పెద్దగూడెం పాఠశాలలో విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

**వనపర్తి,సెప్టెంబర్ 17 (ప్రజాక్షేత్రం):**

పార్టీ ఆదేశాలను ధిక్కరించి, క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి హెచ్చరించారు. గురువారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయనతోపాటు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత వ్యవహారాలు, గ్రామస్థాయి కార్యక్రమాల నిర్వహణ, క్రమశిక్షణ తదితర అంశాలపై చర్చించారు.

**పార్టీ కార్యక్రమాలపై నివేదికలు ఇవ్వాలి**

గ్రామీణ, మండల ప్రాంతాల్లో ప్రతి నెలా పార్టీ కార్యక్రమాలను నిర్వహించాలని శివసేన రెడ్డి సూచించారు. మండల కేంద్రాల్లో మండల కార్యవర్గ సమావేశాలు నిర్వహించడంతోపాటు చేపట్టిన కార్యక్రమాల వివరాలను, ఛాయా చిత్రాలను జిల్లా కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాలపై సమగ్ర నివేదికను రాష్ట్ర పార్టీ అధిష్ఠానానికి పంపనున్నట్లు తెలిపారు. సమావేశాలకు గైర్హాజరయ్యే పార్టీ కార్యవర్గ సభ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. రెండుసార్లు షోకాజ్ నోటీసులు అందుకున్నవారు మూడోసారి కూడా అదే విధంగా వ్యవహరిస్తే పదవి నుంచి తొలగించే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పార్టీ ఇచ్చే కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా చేపట్టాలని కోరారు.

**ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరాలి**

జిల్లా పార్టీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామానికి కమిటీని నియమించి, ఆయా గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని శివసేన రెడ్డి తెలిపారు. ఇటీవల పార్టీ పిలుపు మేరకు నిర్వహించిన నిరసనలు, ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు.
అదేవిధంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయ నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన తేదీని త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

**ప్రజాపాలన దినోత్సవం**

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జాతీయ జెండాను శివసేన రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి ఆవిష్కరించారు.



ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, పోరాటాలు, త్యాగాలను స్మరించుకోవాల్సిన రోజన్నారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి**

వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శివసేన రెడ్డి క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బ్రహ్మం,అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్,చీర్ల జనార్దన్,సహదేవ్,ధనలక్ష్మి, రాజ్‌కుమార్,విజయ్‌కుమార్, పర్వతాలు,వెంకటేష్,కోట్ల రవి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు జానకిరాములు,పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, శత్రురావు బుజ్జి,మండల అధ్యక్షులు కృష్ణ యాదవ్, రామ్‌రెడ్డి,రవికిరణ్,పాఠశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి,సర్పంచ్ పుష్పలత శివకుమార్,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాములు, మాజీ సర్పంచ్ జానకి కొండన్న, నాయకులు రమేష్,శేఖర్‌రెడ్డి, బుచ్చిబాబు,బాలరాజ్,డైరెక్టర్ శారద,విష్ణువర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు,కార్యకర్తలు, గ్రామస్థులు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులు గోసపడుతున్నారు

- కందనెల్లి తండాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం
- గిరిజన సంక్షేమానికి బీఆర్ఎస్ పెద్ద పీట
- 100 ఇండ్లు ఉన్న గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్ దే
- కందనెల్లి తండా అభివృద్ధికి గతంలో నిధులు కేటాయించాం
- ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి
- పాలాభిషేకం కార్యక్రమంలో -తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

**పెద్దేముల్,సెప్టెంబర్ 17 (ప్రజాక్షేత్రం):**

కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులు గోసపడుతున్నారని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అన్నారు.గురువారం మండల పరిధిలోని కందనెల్లి తండా గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు,పార్టీ సీనియర్ నాయకుడు టి .రమేష్ ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి మండల,స్థానిక నాయకుల సమక్షంలో పాలాభిషేకం చేశారు.అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం గిరిజనుల సంక్షేమం, తండాల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు.
గిరిజనుల అభివృద్ధి కోసం ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌కు చట్టబద్ధత, నిధుల కేటాయింపుల పెంపు వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.విద్యారంగంలో గురుకులాలు,ఆశ్రమ పాఠశాలలు, ఐఐటీ-నీట్ కోచింగ్, స్కాలర్‌షిప్‌లు తదితర కార్యక్రమాలు అమలు చేసినట్లు పేర్కొన్నారు.ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచే నిర్ణయం గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న విషయాన్ని గుర్తుచేశారు.కందనెల్లి తండా అభివృద్ధికి తన ఎమ్మెల్యే పదవీకాలంలో పలు పనులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు రోహిత్‌రెడ్డి తెలిపారు.త్రాగునీరు,రోడ్లు, విద్యుత్ దీపాలు,తదితర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామని వివరించారు.ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని ఆయన కోరారు.తండాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను కొనసాగించాలని సూచించారు.గిరిజన మహిళల కోసం కార్పొరేషన్లు,ఎస్టీ భవనాలు హైదరాబాద్ లో గిరిజన భవన్,100 ఇండ్లు ఉన్న గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చడంతో పాటు, గిరిజన నాయకులే సర్పంచులుగా గ్రామాన్ని పరిపాలించుకోవడానికి అవకాశం కల్పించినటువంటి కార్యక్రమాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టడం జరిగిందని అన్నారు.గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించడం జరిగిందని గిరిజనులకు వెన్నుగా ఉన్న ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు 6 గ్యారెంటీలు అమలు కావట్లేదని,మళ్లీ గిరిజనుల బంగారు భవిష్యత్తు కొరకు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.భవిష్యత్తులో గిరిజనులకు అండగా ఉంటామని, అభివృద్ధిలో కుంటుపడిన గిరిజన గ్రామాల అభివృద్ధిని మరోమారు బిఆర్ఎస్ హయాంలో అభివృద్ధి చేసుకుందామని మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు టి.రమేష్,జనార్దన్ రెడ్డి,మారేపల్లి వెంకట్ రెడ్డి,మన్ సాన్ పల్లి రవి నాయక్,వెంకటేష్ చారి,వీరప్ప,చిట్లపల్లి అంజయ్య, ఖదీర్,ధన్ సింగ్,జ్ఞానేశ్వర్,కొండాపూర్ చంద్రప్ప ,బలరాం,పాండు నాయక్,సంతోష్ నాయక్,లక్ష్మణ్ నాయక్,ఖానాపూర్ మల్లేష్,ధన్ రాజ్,కిషన్,శ్రీను,నాగేష్, రమాకాంత్, కందనెల్లి స్వరాజ్,హీరా సింగ్,సురేష్,విజయ్ నాయక్,ఈశ్వర్,కందనెల్లి తాండ గ్రామ కమిటీ అధ్యక్షుడు జెర్పుల జై సింగ్,వార్డు సభ్యుడు కరణ్ సింగ్,నాందేవ్,కైలాస్ నాయక్,అరుణ్ నాయక్ ,శ్రీను నాయక్,కందనెల్లి తండా,మహిళలు,యువకులు గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.





## పర్వేదలో ఘనంగా ప్రజా పాలన జెండా ఆవిష్కరణ

- ప్రజలే, పాలనలో భాగస్వాములు కావాలి.
- పర్వేద సర్పంచ్ సురేందర్ గౌడ్.

**శంకర్‌పల్లి సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం)**

శంకర్‌పల్లి మండలం, పర్వేద గ్రామంలో ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్వేద గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురేందర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడమే ప్రజాపాలన ప్రధాన ఉద్దేశమని అన్నారు. గ్రామ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన అన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సునీత వెంకటరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, యువత, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## చేవెళ్ల ట్రెజరీ కార్యాలయంలో ఏసీబీ దాడులు

- రూ. లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారులు

**చేవెళ్ల, సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

చేవెళ్ల డివిజనల్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు అకస్మాత్తుగా సోదాలు నిర్వహించి సంచలనం సృష్టించారు. బాధితుడి నుంచి లక్ష రూపాయలు లంచం తీసుకుంటుండగా సంబంధిత అధికారులను ఏసీబీ బృందం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. బాధితుని నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ఈ దాడులు నిర్వహించి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ట్రెజరీ కార్యాలయంలో రికార్డులను క్షుణ్ణంగా



పరిశీలిస్తూ పూర్తి స్థాయి విచారణ జరుపుతున్నారు. లంచం డిమాండ్ చేసిన అధికారులపై చట్టపరంగా కేసు నమోదు చేసి, ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సామ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

**నవాబుపేట్,సెప్టెంబర్17(ప్రజాక్షే త్రం):**

నవాబుపేట మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఘనంగా ఎగరవేశారు ఈ కార్యక్రమంలో నవాబుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామా వెంకటరెడ్డి పాల్గొని జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రజలకు మెరుగైన పాలన అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని తెలిపారు ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకురావాలని పార్టీ నాయకులు కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కొరకు ఎన్నో అభివృద్ధి పథకాలను తీసుకువచ్చి ప్రజలకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుం




దని తెలిపారు రాబోయే రోజుల్లో ప్రజలకు అన్ని విధాలుగా సంక్షేమాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో. వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, గ్రామ ఉపసర్పంచ్ తంగడపల్లి మల్లేశం,సికిందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి,దయాకర్ రెడ్డి, మహేందర్,పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి

- నర్ఖూడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్

**శంషాబాద్ సెప్టెంబర్17 (ప్రజాక్షేత్రం):**

శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో గురువారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ పంచాయతీ ఆవరణలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ , జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ... తెలంగాణ విమోచన దినోత్సవం తెలంగాణ ప్రజల చరిత్రలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన రోజని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీరటి మహేష్,వార్డు సభ్యులు చౌట రాజు,కనకమిడి విష్ణు, బుర్కుంట నాగరాజు,పర్వతం వినోద్,కాంగ్రెస్ పార్టీ నాయకులు తొంట అశోక్,గూడెపు లక్ష్మణ్, పులిమామిడి శ్రీకాంత్, నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన సర్పంచ్ బండ లక్ష్మీ నరసింహ

- ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

**శంకర్‌పల్లి సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

శంకర్‌పల్లి మండలం, పొద్దుటూరు ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పొద్దుటూరు గ్రామపంచాయతీ ఆవరణలో జాతీయ జెండాను గ్రామ సర్పంచ్ బండ లక్ష్మీ నరసింహ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్య అతిథిగా బొల్లారం వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు ఏ. నరేందర్ రెడ్డి, శ్వేత, మై మాధవ్, బి. సింహం రాజు, కే. రమాదేవి, కే. తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ కే. శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బి. వెంకట రెడ్డి, గ్రామ పెద్దలు కే. జంగారెడ్డి, బి. సాయిలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు అశోక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, యువజన సంఘాల సభ్యులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహా మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి ప్రజాపాలన దోహద పడుతుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందని వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను మరింత అభివృద్ధి చేసేందుకు అందరూ కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం విద్యార్థులు, యువజన సంఘాల సభ్యులు, గ్రామస్తులతో కలిసి ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



## బీఆర్ఎస్ హయాంలోనే తండాల అభివృద్ధి

- మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం
- - బీఆర్ఎస్ హయాంలోనే గ్రామ పంచాయితీలుగా మారిన గిరిజన తండాలు
- పెద్దేముల్ మండల ఉపసర్పంచుల సంఘం కార్యదర్శి హీరాసింగ్ చౌహాన్

**పెద్దేముల్,సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజన తండాల అభివృద్ధికి పెద్దపీట వేశారని పెద్దేముల్ మండల ఉపసర్పంచుల సంఘం కార్యదర్శి హీరాసింగ్ చౌహాన్ అన్నారు. గురువారం పెద్దేముల్ మండల పరిధిలోని సిద్ధన్నమదుగు తండాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దేముల్ మండల ఉపసర్పంచుల సంఘం కార్యదర్శి హీరాసింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన తండాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడం ద్వారా గిరిజన ప్రాంతాల ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేశారని పేర్కొన్నారు. తండాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చేపట్టిన చర్యలతో అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరిగాయని తెలిపారు. గిరిజనుల సంక్షేమం కోసం అప్పటి ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు తండాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చాయని అన్నారు.తండాల అభివృద్ధికి కృషి చేసిన మాజీ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతగా చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చవాన్ మాన్ సింగ్, భావ్ సింగ్, రామారావు, గ్రామ పెద్దలు రవి, జై సింగ్, గోబ్ర్యా, నారాయణ, రాహుల్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# గర్భిణీ మహిళల ఇంటి వద్దకే వెళ్లి శ్రీమంతం చేసిన కంజర్ల విజయలక్ష్మి.

**యాలాల సెప్టెంబర్ 17 (ప్రజాక్షేత్రం):**

యాలాల మండలంలోని బాగాయిపల్లి, రాఘవపూర్ గ్రామాలలో కంజర్ల విజయ లక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గడప గడపకు శ్రీమంతం కార్యక్రమాలు గురువారం నిర్వహించారు.

ఆయా గ్రామాల్లో గర్భిణీ మహిళల ఇళ్లకు స్వయంగా వెళ్లిన కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ చైర్‌పర్సన్ కంజర్ల విజయలక్ష్మి వారిని ఆప్యాయంగా పలకరించి శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించి ఆశీర్వదించారు. గర్భిణీ మహిళలకు కుటుంబ సభ్యుల మాదిరిగా అండగా నిలిచి, తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు విజయలక్ష్మి గారు తెలిపారు.

ప్రతి తల్లి ముఖంలో చిరునవ్వు చూడాలి... ప్రతి బిడ్డ ఆరోగ్యంగా పుట్టాలి. మహిళల సంతోషమే మా ఫౌండేషన్ లక్ష్యం. అని ఆమె పేర్కొన్నారు.

ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలను గ్రామ గ్రామాన, గడప గడపకు కొనసాగిస్తామని కంజర్ల విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మాజీ జిల్లా కో ఆప్షన్ అధ్యక్షుడు అక్బర్ బాబా సంగం పాండు, బి.రమేష్ అమ్రెష్,అన్వర్, రాఘపూర్ మాజీ సర్పంచ్ అంజిలప్ప,ఉప సర్పంచ్ శ్రీనివాస్,నర్సింలు రాంచందర్ అంజలమ్మ తదితరులు పాల్గొనారు.

# నారేగూడ గ్రామంలో ప్రజా పాలన దినోత్సవం


- **రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ ఎల్వర్తి దీపిక దశరథ్**

**నవాబుపేట్,సెప్టెంబర్17 (ప్రజాక్షేత్రం)**

నవాబుపేట్ మండల పరిధిలోని నారాయగూడ గ్రామంలో.ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ నారేగూడ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ శ్రీమతి ఎల్వర్తి దీపికా దశరథ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అనంతరం ప్రజా పాలన దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే పాలన, గ్రామ అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సర్పంచ్ పేర్కొన్నారు. తదనంతరం. గ్రామ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డు అందజేశారు. ప్రతి ఒక్క కుటుంబానికి రేషన్ కార్డ్ అంటే ప్రతి కుటుంబానికి ఒక భరోసాని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చాకలి శ్రీనివాస్,వార్డు సభ్యులు సుమలత,సమీనా బేగం, అమృతమ్మ,రూపమ్మ, రవీందర్, విష్ణువర్ధన్ రెడ్డి, శేఖర్ రెడ్డి,గ్రామ పెద్దలు హనుమయ్య, సంజీవులు,మహిపాల్ రెడ్డి, మాణిక్య రెడ్డి,రామ్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మంజుల మేడం, అలాగే ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పద్మ మేడం తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష

- **నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.**
- **అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.**
- **భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యం**
- **ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి.**



**తాండూరు,సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

తాండూరు పట్టణంలో శుక్రవారం జరగనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అధికారులు,ప్రజాప్రతినిధులతో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమగ్రంగా చర్చించి,అవసరమైన సూచనలు చేశారు.

నిమజ్జన కార్యక్రమంలో భక్తులకు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.నిమజ్జన మార్గం, ట్రాఫిక్ నియంత్రణ,విద్యుత్ సౌకర్యం,పారిశుద్ధ్యం,తాగునీటి సరఫరా,వైద్య సదుపాయాలు, క్రేన్ల ఏర్పాటు,పోలీసు బందోబస్తు తదితర అంశాలపై సమీక్షించారు. ఆయా శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

**భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి**

ఉత్సవాలను ఎంత ఘనంగా నిర్వహిస్తున్నామో, నిమజ్జన కార్యక్రమంలో కూడా అంతే స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని, నిమజ్జనం సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేదా ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నిమజ్జన మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ వైర్లు, రోడ్డు భద్రత, వాహనాల రాకపోకలు, అత్యవసర వైద్య సేవలు వంటి అంశాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నిమజ్జన ఘాట్‌ల వద్ద ప్రమాద నివారణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**నిమజ్జన మార్గాలు, ఘాట్‌ల పరిశీలన**

సమీక్ష సమావేశం అనంతరం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రాతో కలిసి పట్టణంలోని ప్రధాన కూడళ్లు, నిమజ్జన మార్గాలు, ఘాట్‌లను పరిశీలించారు. పాత తాండూరు, అంబేద్కర్ పార్క్, భద్రప్పగుడి, శివాజీ చౌక్ తదితర ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మల్‌రెడ్డి పల్లి, కోకట్ వాగు వద్ద ఏర్పాటు చేయనున్న నిమజ్జన ఘాట్‌లను పరిశీలించి, అక్కడ భద్రతా చర్యలు, క్రేన్ల ఏర్పాటు, విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సదుపాయాలపై అధికారులతో చర్చించారు. నిమజ్జన సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు అధికారులకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు,హిందూ ఉత్సవ సమితి సభ్యులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గొట్లపల్లి పంచాయతీపై అధికారుల ఫోకస్.. 'ప్రజాక్షేత్రం' ఎఫెక్ట్

- 'ప్రజాక్షేత్రం' కథనానికి స్పందించిన జిల్లా జెడ్పీ సీఈఓ, డీపీఓ
- రెండు అంశాల్లో వేరువేరుగా నివేదికలు సమర్పించిన మండల అధికారులు
- గొట్లపల్లి పంచాయతీ కార్యదర్శి పరమేష్ కు రెండు అంశాల్లో మెమోలు జారీ
- 'ప్రజాక్షేత్రం' కథనంతో కదిలిన అధికార యంత్రాంగం
- పేమెంట్ బిల్లుల, రికార్డుల నిర్వహణ వ్యవహారంపైనా డీపీఓకు నివేదికలు
- లిఖితపూర్వక వివరణలు సేకరించి డీపీఓ
- కార్యాలయానికి నివేదికలు పంపిన ఎంపీడీఓ కే. తిరుమల స్వామి, ఎంపీఓ రతన్ సింగ్






**పెద్దేముల్, సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామపంచాయతీలో రికార్డుల నిర్వహణపై 'ప్రజాక్షేత్రం' దినపత్రికలో ఈ నెల 14న ప్రచురితమైన "బిడ్డ పుట్టాక పెళ్లి సర్టిఫికెట్.. గొట్లపల్లిలో రికార్డుల గందరగోళం" అనే కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. కథనంలో ప్రస్తావించిన అంశాలను పరిశీలించిన జిల్లా జడ్పీ సీఈఓ, డీపీఓ సంబంధిత విషయంపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని మండల అధికారులను ఆదేశించినట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెద్దేముల్ మండల ఎంపీడీఓ కే.తిరుమల స్వామి, ఎంపీఓ రతన్ సింగ్‌లు ఈ వ్యవహారంపై దృష్టి సారించారు. పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి పరమేష్‌కు ఈ నెల 15వ తేదినాడు ఎంపీఓ రతన్ సింగ్ మెమో జారీ చేసి, రికార్డులకు సంబంధించిన అంశంపై లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

**పంచాయతీ కార్యదర్శి నుంచి లిఖితపూర్వక వివరణ**

పెద్దేముల్ ఎంపీఓ రతన్ సింగ్ జారీ చేసిన మెమోకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి పరమేష్ తన వివరణను లిఖితపూర్వకంగా సమర్పించినట్లు ఎంపీఓ తెలిపారు. కార్యదర్శి అందించిన వివరణను నివేదిక రూపంలో రూపొందించి జిల్లా పంచాయతీ కార్యాలయానికి పంపించినట్లు పేర్కొన్నారు. ఈ వివరణలో రికార్డుల నిర్వహణకు సంబంధించిన అంశాలపై కార్యదర్శి తన వివరణను వివరించినట్లు సమాచారం.

**పేమెంట్ బిల్లులపైనా విచారణ**

ఇదిలా ఉండగా, సెప్టెంబర్ 12వ తేదీన "ప్రజాక్షేత్రం" దినపత్రికలో ప్రచురించిన "పనిచేసింది నవీన్... పేమెంట్ మమత పేరుతోనా?" అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించి ఈ విషయంపై విచారణ జరపాలని మండల ఎంపీడీఓ కే.తిరుమల స్వామి, ఎంపీఓ రతన్ సింగ్ లను ఆదేశించారు. ఈ మేరకు ఎంపీఓ రతన్ సింగ్ గొట్లపల్లి గ్రామపంచాయతీలో పేమెంట్ బిల్లులకు సంబంధించి వచ్చిన ఆరోపణలపైనా పంచాయతీ కార్యదర్శి పరమేష్‌కు మెమో జారీ చేశారు. పూర్తిస్థాయిలో బిల్లులు, చెల్లింపులకు సంబంధించిన అంశాలను పరిశీలించిన అనంతరం రూపొందించిన నివేదికను పెద్దేముల్ మండల ఎంపీడీఓ కే.తిరుమల స్వామికి అందజేసినట్లు ఎంపీఓ రతన్ సింగ్ తెలిపారు. ఎంపీడీఓ కే.తిరుమల స్వామి ఆ నివేదికను జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) కార్యాలయానికి పంపించినట్లు కూడా రతన్ సింగ్ వెల్లడించారు.




**అధికారుల పరిశీలనతో వెలుగులోకి అంశాలు**

'ప్రజాక్షేత్రం' దినపత్రికలో గొట్లపల్లి గ్రామపంచాయతీ లో జరిగిన పలు అంశాలపై వరుస కథనాలు ప్రచురితమైన అనంతరం జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించడం, సంబంధిత పంచాయతీ కార్యదర్శి నుంచి లిఖితపూర్వక వివరణ కోరడం, పేమెంట్ బిల్లుల వ్యవహారంపైనా విచారణ జరిపి నివేదికలు ఉన్నతాధికారులకు పంపడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. రికార్డుల నిర్వహణలో జరిగిన పొరపాట్లకు కారణాలు ఏమిటి? సంబంధిత రికార్డుల్లో నమోదైన వివరాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? లేవా ? పేమెంట్ బిల్లుల వ్యవహారంలో ఏమైనా అవకతవకలు చోటుచేసుకున్నాయా? అనే అంశాలపై ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అధికారుల విచారణ, సమర్పించిన నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు ఎలా ఉంటాయన్నది అప్పటివరకు వేచి చూడాల్సి ఉంది.

# మహ్మదాన్ పల్లి గ్రామంలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

- మీనాపల్లి కలాన్ లో పశువుల తొట్టిలో మురుగు నీరు..!!
- కుమ్మరిగూడ గ్రామంలో కూడా అదే పరిస్థితి
- దోమల బెడద.. పారిశుధ్య లోపాలతో పశువులకు, ప్రజలకు ఆరోగ్య ముప్పు.

**నవాబుపేట్,సెప్టెంబర్17 (ప్రజాక్షేత్రం):**

నవాబుపేట్ మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సకాలంలో పరిష్కారం లభించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, మురుగునీరు నిల్వ ఉండటం, కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద పెరిగిందని పేర్కొన్నారు.

**మీనపల్లి కలాన్‌లో పశువుల తొట్టిలో మురుగు నీరు**

మీనపల్లి కలాన్ గ్రామంలో పశువుల కోసం ఏర్పాటు చేసిన తొట్టిలో కొన్ని నెలలుగా మురుగునీరు నిల్వ ఉండటంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోయి కప్పలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. పశువులు కలుషిత నీటిని తాగడం వల్ల వాటి ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే తొట్టిని శుభ్రం చేసి పరిశుభ్రమైన నీటిని అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

**గేట్‌వాల్ లీకేజీతో నీటి వృథా**

మీనపల్లి కలాన్‌లో నల్లాలు విడిచే సమయంలో గేట్‌వాల్ లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతోందని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు గ్రామ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి వృథాను అరికట్టి గేట్‌వాల్ లీకేజీని వెంటనే మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

**కుమ్మరిగూడ, మమ్మదాన్‌పల్లిలో రోడ్లపైకి మురుగునీరు**

కుమ్మరిగూడ, మమ్మదాన్‌పల్లి గ్రామాల్లో అండర్‌డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీరు రోడ్లపైకి చేరుతోందని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో రోడ్లపై దుర్వాసనతో పాటు దోమలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారే అవకాశం ఉందని, సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.



**సమస్యలను వెంటనే పరిష్కరించాలి.**

గ్రామాల్లో పారిశుధ్య సమస్యలపై సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది తక్షణమే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మీనపల్లి కలాన్‌లో పశువుల తొట్టిని శుభ్రం చేయడంతో పాటు గేట్‌వాల్ లీకేజీని అరికట్టాలని, కుమ్మరిగూడ, మమ్మదాన్‌పల్లి గ్రామాల్లో అండర్‌డ్రైనేజీ సమస్యను పరిష్కరించి మురుగునీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# శ్రీశైలంలో ఈవో ఆకస్మిక తనిఖీలు

**నంద్యాల,సెప్టెంబర్ 17 (ప్రజాక్షేత్రం):**

పరిపాలనాంశాలలో భాగంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు పలు ప్రదేశాలను ఆకస్మికంగా పరిశీలించారు.

పాతాళగంగ స్నానఘట్టాలు, సిద్ధరామప్ప వాణిజ్య సముదాయం, పలు ప్రదేశాలలోని శౌచాలయాలు మొదలైనవాటిని కార్యనిర్వహణాధికారి పరిశీలించడం జరిగింది.

ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలకు అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. అందుకే పాతాళగంగ పరిసరాలను, పాతాళగంగమెట్లను, ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తుండాలని పారిశుద్ధ్య విభాగపు అధికారులను ఆదేశించారు. అవసరం మేరకు పాతాళగంగ పరిసరాలలో మరియు మెట్ల మార్గంలో మరిన్ని విద్యుద్దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. పాతాళగంగలో మరిన్ని సూచికబోర్డులను ఏర్పాటు చేయాలని శ్రీశైలప్రభ మరియు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ బోర్డుల ఏర్పాటు శాశ్వత ప్రాతిపదికతో ఉండాలన్నారు.

అదేవిధంగా పాతాళగంగలో ప్రమాదాలు జరగకుండా వుండేందుకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పాతాళగంగ నీటిమట్టాన్ని బట్టి ఎప్పటికప్పుడు బ్యారికేడింగును పరిశీలిస్తుండాలన్నారు. ప్రమాదాలు నిరోధించేందుకు ఏర్పాటు చేయబడిన ఈతనిపుణులు కూడా మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

పాతాళగంగలోని స్త్రీలు దుస్తులు మార్చుకునే గదులకు మరియు శౌచాలయాలకు ఎప్పటికప్పుడు అవసరమైన మరమ్మతులు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.



పాతాళగంగతో పాటు క్షేత్రపరిధిలోని అన్ని శౌచాలయాలను నిరంతరం పరిశుభ్రంగా ఉండేవిధంగా నిర్వహిస్తుండాలని పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు. శౌచాలయాలకు ఎటువంటి అంతరాయం లేకుండా నీటిసరఫరా ఉండాలని నీటిసరఫరా విభాగాన్ని ఆదేశించారు.

ఆయా పరిసరాలలోని పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలని ఉద్యానవన విభాగాన్ని ఆదేశించారు. ఈ విషయములో ఉద్యానవనం, పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్ విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు.

అనంతరం సిద్ధరామప్ప వాణిజ్య సముదాయాన్ని పరిశీలించారు. దుకాణసముదాయంతో పాటు పరిసరాలన్నీ కూడా పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే వాణిజ్య సముదాయంనందు చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించేవిధంగా సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. అదేవిధంగా శ్రీశైలక్షేత్రాన్ని స్వచ్ఛ శ్రీశైలంగా ఉంచేందుకు స్థానికులు, దుకాణదారులు అందరు కూడా దేవస్థానానికి సహకరించాలన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ

**మహేశ్వరం సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా మహేశ్వరంలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం మండల అధ్యక్షులు యాదిష్ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు.

ఈ సందర్భంగా యాదిష్ మాట్లాడుతూ తెలంగాణ విమోచన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత అని అన్నారు. దేశ సమైక్యత కోసం విశేష కృషి చేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ సేవలు, త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి,జాతీయ సమైక్యత దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు.అదే స్ఫూర్తితో అభివృద్ధి చెందిన, సమైక్యమైన తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం మండల అధ్యక్షులు యాదిష్ ,రాష్ట్ర నాయకులు దేశ్యా నాయక్,రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి కుండే వెంకటేష్,గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి పాండు నాయక్, రాష్ట్ర గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యులు పంత్తు నాయక్,మాజీ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్ యాదవ్,జిల్లా నాయకులు హన్మంత్ నాయక్ ,హన్మాత్ నాయక్,ప్రధాన కార్యదర్శులు వనంపల్లి శ్రవణ్,మండల మీడియా కన్వీనర్ మోతే యాదయ్య,మండల ఉపాధ్యకుడు,రూప్సింగ్ నాయక్,మండల కార్యదర్శి పోల్కం మహేందర్,మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు ఎర్ర పాండు,మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు గోల్లూరు మాధవ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు రఘువీర్,మండల అధికార ప్రతినిధి గుత్తి రాజు ,సర్పంచ్ బుగ్గని యాదమ్మ యాదయ్య,అండాలు కృష్ణ యాదవ్,రావినాయక్ ,మాజీ సర్పంచ్ కాసుల సురేష్ , రఘుపతి గౌడ్,ఎంపీటీసీలు,శక్తి కేంద్ర ఇన్చార్జిలు,బూత్ అధ్యక్షులు, మరియు పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రధానమంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోదీ 76వ జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు

**మహేశ్వరం,సెప్టెంబర్ 17 (ప్రజాక్షేత్రం):**
ప్రధానమంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోదీ 76వ జన్మదినోత్సవం సందర్భంగా మహేశ్వరం శ్రీ రాజరాజేశ్వరీ స్వామి దేవాలయం (శివగంగా) ఆవరణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.
దేశ ప్రజల సంక్షేమం, దేశాభివృద్ధి,జాతీయ సమైక్యత కోసం మోదీ చేస్తున్న సేవలను స్మరించుకుంటూ,ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని, దేశ ప్రజలకు మరింత సేవ చేసే శక్తి కలగాలని ఆకాంక్షిస్తూ 76 దీపాలతో ఆశీస్సుల దీపాన్ని వెలిగించడం జరిగింది.అనంతరం మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం మండల అధ్యక్షులు యాదిష్,రాష్ట్ర నాయకులు దేశ్యా నాయక్,రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి కుండే వెంకటేష్ ,గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి పాండు నాయక్, రాష్ట్ర గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యులు పంత్తు నాయక్,మాజీ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్ యాదవ్,జిల్లా నాయకులు హన్మంత్ నాయక్,హన్మాత్ నాయక్,ప్రధాన కార్యదర్శులు వనంపల్లి శ్రవణ్,మండల మీడియా కన్వీనర్ మోతే యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ విమోచన దినోత్సవం వేడుకలలో పాల్గొన్న సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ

**మహేశ్వరం,సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం కల్వకోల్ గ్రామ పంచాయతీ వద్ద ఘనంగా సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం: సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.జాతీయ పతాకం ఎగురవేసి జయ జయహే తెలంగాణ విద్యార్థులచే ఆలపించి తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచెయ్యాలన్నారు.ఆనాడు రజాకారులు నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి నా మన మహనీయులను స్మరించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం ఆగస్ట్ 15 1947 వస్తే తెలంగాణకు మాత్రం 1948 సెప్టెంబర్ 17 న వచ్చిందన్నారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆనాడు సైనిక చర్య హైదరాబాదు చుట్టూ ముట్టు విధించి రజాకార్లను లొంగిపోయేలా చేశారు...అదేవిధంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన ఆర్టికల్ ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు.ఈకార్యక్రమంలో పాల్గొన్నవారు విలేజ్ సెక్రటరీ వేణు ఉపసర్పంచ్ జనార్ధన్ గౌడ్ వార్డ్ మెంబర్ మల్లేష్,మంగ, గ్రామ పెద్దలు బక్కని రవి మాదిగ,మహేందర్,శ్రీను, మల్లేష్,ఎర్ర నవీన్,ప్రిన్సిపల్ కవిత,అంగన్వాడి టీచర్ సంతోష,గ్రామ పెద్దలు చిన్నలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలంలోని 33 గ్రామాలను విలీనం చేయాలి

- జే ఏ సీ ఆధ్వర్యంలో కమిషనర్ శశాంక్‌కు వినతి
- భారీగా తరలివచ్చిన 33 గ్రామాల ప్రజలు.
- డప్పు కళాకారుల నృత్యాలు.
- స్థానిక ఎమ్మెల్యే సబితా రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు.

**మహేశ్వరం,సెప్టెంబర్ 17 (ప్రజాక్షేత్రం):**
ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలో మహేశ్వరం మండల పరిధిలోని మొత్తం 33 గ్రామాలను విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. జే ఏ సీ ఆధ్వర్యంలో మహేశ్వరం బీరప్ప టెంపుల్ నుండి భారీ ర్యాలీగా వచ్చి అంబేద్కర్ కు పూలమాలలు వేసి అక్కడి నుంచి ఎఫ్సిడిఏ కమిషనర్ కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరి వచ్చారు. 33 గ్రామాల ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ కమిషనర్ శశాంక్ కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకాగా, డప్పు కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డప్పుల మోతతో కళాకారులు నృత్యాలు చేస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే సబితా రెడ్డికి వ్యతిరేకంగా కొందరు నినాదాలు చేశారు.
గో బ్యాక్ సబితా అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మహేశ్వరం మండలంలోని 33 గ్రామాలను ఫ్యూచర్ సిటీ పరిధిలోకి తీసుకురావాలనే డిమాండ్‌పై తమ నిరసనను వ్యక్తం చేశారు.33 గ్రామాలను ఒకే అభివృద్ధి పరిధిలోకి తీసుకురావాలి
మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలో భాగం చేయాలని కేఎల్ఆర్ కోరారు. గ్రామాలను విడదీయకుండా సమగ్రంగా అభివృద్ధి చేయాలని, రోడ్లు, డ్రైనేజీ,తాగునీరు, విద్యుత్,ప్రజా రవాణా,విద్య, వైద్యం,ఉపాధి వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.
ఫ్యూచర్ సిటీ అభివృద్ధి వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా ప్రయోజనాలు అందేలా ప్రణాళిక రూపొందించాలని,స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, 33 గ్రామాలకు చెందిన ప్రజలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పెద్దల (కొత్తల) పండుగ

- ఆదివాసీ సాంస్కృతి-సంప్రదాయలే ఆదివాసీలకు గౌరవం- ఆదివాసీ దొర పటేళ్ళు,తుడుందెబ్బ, ఆదివాసీ ఉద్యోగ సంఘాలు

**కొత్తగూడ,సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**
ఆదివాసులకు సంస్కృతి సంప్రదాయాల తోనే గౌరవం ఉంటుందని సాంస్కృతి సంప్రదాయలు కనుమరుగు అయితే జాతి మనుగడ ఉండదని ఆదివాసీలు కను మారుగు అయిపోతారని ఆదివాసీ దొర పటేళ్ళు, తుడుందెబ్బ, ఆదివాసీ ఉద్యోగ సంఘ నాయకులు అన్నారు.
కొత్తగూడ మండలం గాంధీనగర్ లో ఉన్న సమ్మక్క సారాలమ్మ తల్లీ ప్రాంగణం లో ఘనంగా కొత్తల(పెద్దల)పండుగను గాంధీ నగర్ కొత్తగూడ బూరు గుంపు దొర పటేళ్ళు తుడుందెబ్బ ఆదివాసీ ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు.
ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలు పండుగ లలో భాగంగా ఉత్తరకార్తి మొదటి పాదంలో జరిగే కొత్తల (పెద్దల) పండుగను నిర్వహించిన ఆదివాసీలు ముందుగా కొత్తగూడ గాంధీనగర్ బొడ్రాయి దగ్గర కుమ్రం భీం విగ్రహం దగ్గర పాలకాయ కొట్టి శ్రీ సమ్మక్క సారాలమ్మ తల్లీ గుడి ప్రాంగణంలో ఆదివాసి సంస్కృతి సాంప్రదాయ ప్రకారం పూజలు నిర్వహించి వెన్ను కట్టి వారి పూర్వీకులను స్మరించుకున్నారు.
ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ పూర్వం నుండి ఆదివాసీలు తమ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తూ ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఆదివాసీల సాంస్కృతి సంప్రదాయలను నేటికీ కొనసాగిస్తున్నారు ప్రస్తుతం ఇతర మతాల సాంస్కృతి ఆదివాసీల పై పడినప్పటికి నేటికీ ఆదివాసీలు వారి ఇలావేల్పులను మొక్కుతూ కాపాడుకుంటున్నారు భవిష్యత్తు యువతీ యువకులు కాపాడుకోవాలని ఆదివాసులు ఐకమత్యంగా ఉండాలని



అన్నారు.కార్యక్రమం లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు మల్లెల రాము కుంజ నర్సింగ రావు పూనేం సందీప్ కుమార్ మల్లెల సారయ్య ఈసం రంగ రావు ఆదివాసీ దొర పటేళ్ళు మల్లెల బాబు సిద్దబోయిన భద్రయ్య అలెం గణేష్ మల్లెల నర్సయ్య కంగాల రవి వజ్జ బాలరాజు గుమ్మడి సమ్మయ్య ఆదివాసీ ఉద్యోగ సంఘ నాయకులు గుమ్మడి లక్ష్మి నారాయణ చుంచ సారయ్య దొర వాసం కిషేందర్ అలెం సాంబయ్య ఏంపల్లి సమ్మయ్య బంగారి నాగేశ్వర్ రావు ఏంపల్లి సరజన తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

**వలిగొండ,సెప్టెంబర్ 17 (ప్రజాక్షేత్రం):**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్. నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు.విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, తీన్మార్ నృత్యాలతో సందడి చేశారు. కళాశాల అధ్యాపకులు సైతం ప్రత్యేక నృత్య ప్రదర్శనలు చేసి విద్యార్థులను అలరించారు. దీంతో కళాశాల ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అధ్యాపకులతో మమేకమై తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ విద్యార్థి జీవితంలో కీలకమైందని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పరశురాములు ,హానీఫ్, వెంకటాచారి,మురళి,విజయ్ కుమార్,సురేష్,బిక్షం,స్వప్న, సైదా,రవి,కృష్ణ,గణేష్ కుమార్, గోపి,మృదుల,ఆనంద్,విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించండి

**నంద్యాల,సెప్టెంబరు 17 (ప్రజాక్షేత్రం):**
మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించి పిల్లలకు కడుపునిండా అన్నం పెట్టాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్ లింగాల నాగరాజు అన్నారు. పాములపాడు మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్లో ఆకస్మికంగా తనిఖీ చేసి ఆయన మాట్లాడుతూ భోజనములో నాణ్యత పాటించాలని అలాగే తాజా కూరగాయలు తెచ్చి కూరలు వండి పిల్లలకు వడ్డించాలని వంట చేసే పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన అన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాల్సిన బాధ్యత వట్టమనసులదేనని భోజనంలో నాణ్యత పాటించకుంటే జిల్లా కలెక్టర్ కు,ఎమ్మెల్యే కి ఫిర్యాదు చేస్తానని ఆయన హెచ్చరించారు.





## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అర్కతల సర్పంచ్ గంజాయి రేణుక రాములు

**నవాబుపేట్,సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**
ప్రజా పోరాటాలతో నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పలికి తెలంగాణ విముక్తి కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా అర్కతల గ్రామ పంచాయతీలో జెండా కార్యక్రమం సర్పంచ్ రేణుక రాములు ఆవిష్కరించారు. తెలంగాణ విమోచన దినోత్సవం పురస్కరించుకొని సర్పంచ్ రేణుక రాములు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం స్వేచ్ఛ సమానత్వం కోసం పోరాడిన అమరవీరుల స్ఫూర్తితో తెలంగాణ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గరోజని వారు కొనియాడారు
ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి స్వప్న ఉప సర్పంచ్ శివనీల భాగయ్య గ్రామ పెద్దలు బుచ్చిరెడ్డి కుమ్మరి అంజయ్య మాలిస్ రాంరెడ్డి మినపల్లి అంజయ్య గొల్ల వెంకటరమణ వార్డు మెంబర్లు వడ్డే వెంకటయ్య కావలి అంజయ్య కొత్తగాడి మాణిక్యం కుమ్మరి విఠల్ సింగపురం సాయిరెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడరాదు


- మధ్యాహ్న భోజన నాణ్యతపై సర్పంచ్ ఆరా
- బియ్యం నాణ్యత బాగోలేదని ఏజెన్సీ నిర్వాహకుల వెల్లడి
- నాణ్యత లేని బియ్యాన్ని వెంటనే వెనక్కి పంపాలని సూచన
- 350 మంది విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడమే లక్ష్యం
- పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై. నర్సింహులు

**పెద్దేముల్,సెప్టెంబర్ 17 (ప్రజాక్షేత్రం):**
విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో రాజీ ఉండకూడదని పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై.నర్సింహులు అన్నారు.గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలకు చేరుకున్న సర్పంచ్ విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.
అనంతరం మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో సర్పంచ్ మాట్లాడగా ఈసారి విద్యార్థుల కోసం సరఫరా చేసిన బియ్యం నాణ్యతగా లేదని వారు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే సర్పంచ్ ఎంఈఓను పిలిపించి గోదాం నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడించారు. నాణ్యత లేని బియ్యాన్ని వెంటనే వెనక్కి పంపించి, విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా కొత్త బియ్యాన్ని త్వరితగతిన పాఠశాలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓను కోరారు.ఈ విషయంపై ఎంఈఓ గోదాం నిర్వాహకులతో మాట్లాడగా.. నాణ్యత లేని బియ్యాన్ని రిటర్న్ తీసుకుని, వెంటనే కొత్త బియ్యాన్ని పాఠశాలకు పంపిస్తామని వారు హామీ ఇచ్చారు.
ఈ సందర్భంగా పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై. నర్సింహులు మాట్లాడుతూ
విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని సూచించారు.నాణ్యత లేని బియ్యం సరఫరా అయిన విషయం తన దృష్టికి రావడంతో వెంటనే ఎంఈఓతో మాట్లాడి గోదాం నిర్వాహకులకు సమాచారం అందించినట్లు తెలిపారు.బియ్యాన్ని వెంటనే వెనక్కి పంపించి, నాణ్యమైన కొత్త బియ్యాన్ని పాఠశాలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తూ మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తామని సర్పంచ్ తెలిపారు.గురువారం పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి మొత్తం 350 మంది విద్యార్థులు హాజరయ్యారు.విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా అధికారులు, నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సర్పంచ్ సూచించారు.ఈ తనిఖీలో పాఠశాల జీహెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పిజిఆర్ఎస్ లో ఇచ్చిన అర్జీకి స్పందన

**నంద్యాల,సెప్టెంబర్17 (ప్రజాక్షేత్రం):**
నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా మండల కేంద్రమైన పాములపాడులో నిర్వహించిన (పి జి ఆర్ ఎస్) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్.కరీంబాష, రుద్రవరం టిడిపి నాయకుడు రాచపూడి సురేష్ లు ఇచ్చిన అర్జి మేరకు కేసి.కెనాల్ తూము వద్ద కృంగిన పిల్లకాల్వకి సంబంధించిన కల్వర్టు ,సైడ్ వాల్ లను కేసి.కెనాల్ ఏఈ శ్రీనివాసులు నాయక్ మరియు కేసి.కెనాల్ వర్క్ ఇన్స్పెక్టర్ జె.నాగేశ్వరుడు లు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు ఆయకట్టు రైతులకు ఇబ్బందులకు గురి కాకుండా సానుకూలంగా స్పందించి ఉన్నత అధికారుల దృష్టికి కృంగిన సైడ్ వాల్ సమస్యను తీసుకొని వెళ్లగా, వారు కల్వర్టుల పునర్నిర్మాణం కోసం నివేదిక పంపించినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేసి. కెనాల్ టిసి చిన్నబాబుసా,రైతులు మధుసూదన్ రెడ్డి,నాగశేషులు, ప్రేమరాజు,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.







# గిరిజన రిజర్వేషన్ల పెంపు ఘనత కేసీఆర్‌దే

- బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి
- కొత్తగూడలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

**కొత్తగూడ,సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

గిరిజనులకు రిజర్వేషన్లను పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ






## ప్రజా పాలన దినోత్సవ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ

- గ్రామ సర్పంచ్ ఎల్వర్తి దీపిక దశరథ్

**నవాబు పేట సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

నవాబుపేట్ మండల కేంద్రంలోని నారాయగూడ గ్రామంలో ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ నారేగూడ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ శ్రీమతి ఎల్వర్తి దీపికా దశరథ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజా పాలన దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే పాలన, గ్రామ అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సర్పంచ్ పేర్కొన్నారు. తదనంతరం గ్రామ ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డు అందజేశారు. ప్రతి ఒక్క కుటుంబానికి రేషన్ కార్డ్ అంటే ప్రతి కుటుంబానికి ఒక భరోసాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చాకలి శ్రీనివాస్, వార్డు సభ్యులు సుమలత, సమీనా బేగం, అమృతమ్మ, రూపమ్మ, రవీందర్, విష్ణువర్ధన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, గ్రామ పెద్దలు హనుమయ్య, సంజీవులు, మహిపాల్ రెడ్డి, మాణిక్య రెడ్డి, రామ్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మంజుల మేడం, అలాగే ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

## కోకట్ గ్రామస్తుల తాగునీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

- రెండు బోర్లు వేయించిన ఎమ్మెల్యే.
- డి ఎం ఎఫ్ టి రూ.4.60 లక్షలు, నిధులు.

**యాలాల సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

యాలాల్ మండలం కోకట్ గ్రామ ప్రజల మంచినీటి సమస్య తీరినట్టే గురువారం గ్రామస్తుల సమన్వయం, నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా రూ.4.60 లక్షల డిఎం ఎఫ్ టి నిధులతో రెండు బోర్లను వేయించారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కోకట్ సర్పంచ్ రాజేందర్ రెడ్డి, గ్రామస్తులు, త్రాగు నీటి సమస్యను తీర్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు. తాండూరు మున్సిపాలిలోని వినాయకులను నిమజ్జనం చేసేది కోకట్ కాగ్నానదిలోనే నిమజ్జనానికి సంబంధించిన అన్ని ఏర్పాటను శాఖల వారిగా అధికారులు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఆర్డీవో అనిత, తాండూరు మున్సిపల్ చైర్మన్ నీరజబాల్ రెడ్డి, యాలాల తాహసిల్దార్ గాయత్రి, తాండూరు ఏఎంసీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కుర్వ మహిపాల్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీఎం నాయకులు కె. హన్మంతు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెండా ఎగరవేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సామ వెంకట్ రెడ్డి.

**నవాబుపేట్ సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

నవాబుపేట మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఘనంగా ఎగరవేశారు ఈ కార్యక్రమంలో నవాబుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామా వెంకటరెడ్డి పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రజలకు మెరుగైన పాలన అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకురావాలని పార్టీ నాయకులు కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కొరకు ఎన్నో అభివృద్ధి పథకాలను తీసుకువచ్చి ప్రజలకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు రాబోయే రోజుల్లో ప్రజలకు అన్ని విధాలుగా సంక్షేమాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, గ్రామ ఉపసర్పంచ్ తంగడపల్లి మల్లేశం, సికిందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, మహేందర్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






## ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి దుద్దీళ్ల శ్రీధర్ బాబు

**మహేశ్వరం.సెప్టెంబర్ 17 (ప్రజాక్షేత్రం):**


రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కొంగరకలాన్‌లో గురువారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ,శాసనసభ వ్యవహారాల మంత్రి,జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దీళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అంతకుముందు మంత్రి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అమరవీరుల స్తూపం,తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను కలిసి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రగతి, సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలనుద్దేశించి మంత్రి ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన శేఖర్ రెడ్డి,సిరిపురం యాదగిరి, కాకి కుమార్, దినేష్ చంద్ర కుటుంబ సభ్యులను మంత్రి శ్రీధర్ బాబు,శాసన సభ్యులు,జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్,జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి,కిరణ్మయి, జిల్లా అటవీశాఖ అధికారి శివ ఆశిష్ సింగ్, శంషాబాద్ డీసీపీ బి.రాజేశ్, జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, కలెక్టరేట్ ఏఓ సునీల్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం అందజేత

**వలిగొండ, సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంటేకుల సోమారం గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కీర్తి వెంకటేశం ఇటీవల మరణించడంతో విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ గురువారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి 10 వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని అందజేశారు...ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బండారపు లింగస్వామి,మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, రాచకొండ కృష్ణ, బచ్చు శ్రీనివాస్, మైసొల్ల రామ నర్సు, పోలునాగయ్య, గజ్జెల అమరేందర్, మహేష్, బూత్ అధ్యక్షుడు వెంకట రెడ్డి, నవీన్ రెడ్డి రంజిత్ రెడ్డి, అంబరీష తదితరులు పాల్గొన్నారు.



## పలు కార్యక్రమాలలో పాల్గొన్న భీమ్ భరత్

**నవాబుపేట్ సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

నవాబుపేట మండలం తిమ్మారెడ్డి పల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కందాడ గోవింద్ రెడ్డి మనుమరాలు, మనుమడు పుట్టు దోతుల శుభ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన భీమ్ భరత్ ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, సర్పంచుల సంఘం అధ్యక్షులు ఎల్లకొండ గ్రామ సర్పంచ్ కొండల్ యాదవ్, సామ సంజీవ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉపేందర్ రెడ్డి, తిమ్మారెడ్డి పల్లి సర్పంచ్ ప్రభాకర్, పులుమామిడి సర్పంచ్ నర్సింలు, చించల్ పెట్ సర్పంచ్ అనంత రాములు, ఎల్లకొండ ఉప సర్పంచ్ రామ్ చందర్, శివ, కుమ్మరి గూడ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ గోపాల్ కృష్ణ, యాదయ్య, సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.






## శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

**వలిగొండ సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్. నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు.విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, తీన్మార్ నృత్యాలతో సందడి చేశారు. కళాశాల అధ్యాపకులు సైతం ప్రత్యేక నృత్య ప్రదర్శనలు చేసి విద్యార్థులను అలరించారు. దీంతో కళాశాల ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు అధ్యాపకులతో మమేకమై తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ విద్యార్థి జీవితంలో కీలకమైందని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పరశురాములు, హనీఫ్, వెంకటాచారి, మురళి, విజయ్ కుమార్, సురేష్, బిక్షం, స్వప్న, సైదా, రవి, కృష్ణ, గణేష్ కుమార్, గోపి, మృదుల, ఆనంద్ తదితరులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రామాపురంలో తీవ్ర విషాదం

**నంద్యాల సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

జీఎన్ఎస్ఎస్ కాలువలో పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గల్లంతు సరదాగా కాలువ వద్దకు వెళ్లిన ఎనిమిది మంది కుటుంబ సభ్యులు.. ప్రమాదవశాత్తు నీటిలో పడ్డ 6 ఏళ్ల బాలుడు కొడుకును రక్షించేందుకు కాలువలోకి దూకిన తండ్రి, ఇద్దరు బావమరుదులు నీటి ఉధృతి తీవ్రంగా ఉండటంతో కొట్టుకుపోయిన తండ్రి అఫ్రోజ్, కుమారుడు ఆరిష్(6), బావమరిది ఆసిఫ్ బాధితుల స్వస్థలం బేతంచెర్ల.. రామాపురం నాపరాతి ఫ్యాక్టరీలో పని చేస్తున్నట్లు గుర్తింపు గాలేరు నగరి కాలువలో కొట్టుకుపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించిన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసి బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రభుత్వానికి నివేదిక పంపుతాం కడప జిల్లాకు 3 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో తీవ్రంగా ఉన్న ప్రవాహ వేగం సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్న డోన్ డి.ఎస్.పి శ్రీనివాస్ బనగానపల్లె సీఐ మంజునాథ రెడ్డి ఫైర్ సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ ఎన్ డిఆర్ఎఫ్ సహాయం కోరినట్లు తెలిపిన సీఐ మంజునాథ్ రెడ్డి.

నీటి ప్రవాహాన్ని తగ్గించేందుకు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడినట్లు తెలిపిన సీఐ మంజునాథ రెడ్డి.





## ఘనంగా పెద్దల (కొత్తల) పండుగ

**కొత్తగూడ సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**

ఆదివాసులకు సంస్కృతి సంప్రదాయాల తోనే గౌరవం ఉంటుందని సాంస్కృతి సంప్రదాయలు కనుమరుగు అయితే జాతి మనుగడ ఉండదని ఆదివాసీలు కను మారుగు అయిపోతారని ఆదివాసీ దొర పటేళ్ళు, తుడుందెబ్బ, ఆదివాసీ ఉద్యోగ సంఘ నాయకులు అన్నారు. కొత్తగూడ మండలం గాంధీనగర్ లో ఉన్న సమ్మక్క సారాలమ్మ తల్లీ ప్రాంగణంలో ఘనంగా కొత్తల(పెద్దల) పండుగను గాంధీనగర్ కొత్తగూడ బూరు గుంపు దొర పటేళ్ళు తుడుందెబ్బ ఆదివాసీ ఉద్యోగులు ఘనంగా నిర్వహించరు. ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలు పండుగలలో భాగంగా ఉత్తరకార్తి మొదటి పాదంలో జరిగే కొత్తల (పెద్దల) పండుగను నిర్వహించిన ఆదివాసీలు ముందుగా కొత్తగూడ గాంధీనగర్ బొడ్రాయి దగ్గర కుమ్రం భీం విగ్రహం దగ్గర పాలకాయ కొట్టి శ్రీ సమ్మక్క సారాలమ్మ తల్లీ గుడి ప్రాంగణంలో ఆదివాసి సంస్కృతి సాంప్రదాయ ప్రకారం పూజలు నిర్వహించి వెన్ను కట్టి వారి పూర్వికులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ పూర్వం నుండి ఆదివాసీలు తమ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తూ ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఆదివాసీల సాంస్కృతి సంప్రదాయలను నేటికీ కొనసాగిస్తున్నారు ప్రస్తుతం ఇతర మతాల సాంస్కృతి ఆదివాసీలపై పడినప్పటికి నేటికీ ఆదివాసీలు వారి ఇలావేల్పులను మొక్కుతూ కాపాడుకుంటున్నారు. భవిష్యత్తు యువతీ యువకులు కాపాడుకోవాలని ఆదివాసులు ఐకమత్యంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు మల్లెల రాము కుంజ నర్సింగ రావు పూనెం సందీప్ కుమార్ మల్లెల సారయ్య ఈసం రంగ రావు ఆదివాసీ దొర పటేళ్ళు మల్లెల బాబు సిద్దబోయిన భద్రయ్య అలెం గణేష్ మల్లెల నర్సయ్య కంగాల రవి వజ్జ బాలరాజు గుమ్మడి సమ్మయ్య ఆదివాసీ ఉద్యోగ సంఘ నాయకులు గుమ్మడి లక్ష్మి నారాయణ చుంచ సారయ్య దొర వాసం కిషేందర్ అలెం సాంబయ్య ఏంపల్లి సమ్మయ్య బంగారి నాగేశ్వర్ రావు ఏంపల్లి సరజన తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తాం

- **సర్పంచ్ మధ్యపాగ కృష్ణ.**

**మొయినాబాద్, సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**
గ్రామాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తామని సర్పంచ్ మధ్యపాగ కృష్ణ పేర్కొన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా గ్రామ సర్పంచ్ మధ్యపాగ కృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. అనంతరం గ్రామస్థులందరితో కలిసి జాతీయగీతం ఆలపించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కృష్ణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడమే తన ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. గ్రామ ప్రజలందరి సహకారంతో అమ్డాపూర్ గ్రామాన్ని అన్నింట్లోనూ ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో యువకులు, నాయకులు పాల్గొన్నారు.




# కేజీబీవీలో అతిథి ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**మొయినాబాద్, సెప్టెంబర్ 17(ప్రజాక్షేత్రం):**
మండల పరిధిలోని ఖాశీంబౌలి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం నజీబ్‌నగర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయులు, అధ్యాపకుల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ పాఠశాల ప్రత్యేక అధికారి హరిష గురువారం తెలిపారు. ఈ విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాబోధన కొనసాగుతోందని ఆమె పేర్కొన్నారు. ఈ పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు (6 నుండి 10వ తరగతి వరకు) డిగ్రీతో పాటు బీఈడీ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలసరి వేతనం రూ. 18,000 అందజేస్తామని తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి నెలసరి వేతనం రూ. 23,000 చెల్లిస్తామన్నారు. బోధనా సమయంతో పాటు రాత్రి వేళల్లో నిర్వహించే స్టడీ అవర్స్‌లోనూ విధిగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని ప్రత్యేక అధికారి స్పష్టం చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 21వ తేదీలోపు నేరుగా కేజీబీవీ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.




# విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి

**మొయినాబాద్, సెప్టెంబర్ 17(ప్రజా-క్షేత్రం):**
విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందిన సంఘటన చేవెళ్ల మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో చోటుచేటుచేసుకుంది. గ్రామానికి చెందిన కందికొండ శ్రీనివాస్ గౌడ్ కు చెందిన ఐదు పాడిగేదెలు కలవు రోజుమాదిరిగా గేదెలను తీసుకుని భఫీర్ఖ్భామికి మేతకోసం తీసుకువెళ్లాడు. అయితే ఈ క్రమంలో మేతమేయడానికి వెళ్లిన స్థలంలో విద్యుత్ వైర్లు తెగి కింద పడిపోయిన వైర్లు రెండు పాడిగేదెలకు తగలడంతో అక్కడికక్కడే మరణించగా మిగితా మూడు పాడిగేదెలు తప్పించుకున్నాయి. దీంతో బాధితుడు శ్రీనివాస్ బోరున విలపించాడు. సుమారు రెండు గేదెల విలువ రూ.80వేల ఉంటుందని తెలిపారు. అనంతరం బాధితుడు మాట్లాడుతూ... విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే తన పాడిగేదెలు మరణించాయని తెలిపారు. పలుమార్లు విద్యుత్ సమస్య గురించి విద్యుత్ అధికారులకు గ్రామస్తులతో కలిసి విన్నవించామని వెల్లడించారు. విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ సంఘటన జరిగిందన్నారు. తనకు ప్రభుత్వం తరపున ఆర్థికసాయం అందించాలని ఆయన అధికారులను కోరారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు మొండి వైఖరి వీడి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు.



# 14 గంటల వెయిటింగ్.. గదులు లేవు, తిండి లేదు.. ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ల కష్టాలు!

- **నాగోయాలో భారత అథ్లెట్లకు వసతి కష్టాలు**
- **కొందరికి ఆహారం కూడా అందుబాటులో లేక ఇబ్బందులు**
- **గదులు వచ్చిన వారిని ఇతరులతో సర్దుకోవాలని సూచన**
- **రోయర్లు, షూటర్లు సహా పలు బృందాలకు సమస్య**
- **ఇతర హోటళ్లకు కొందరు భారత సభ్యుల తరలింపు**
- **అథ్లెట్ల సంఖ్య అంచనాలో పొరపాటే కారణమని నివేదిక**




ప్రజాక్షేత్రం :
ఆసియా క్రీడల కోసం జపాన్‌లోని నాగోయాకు చేరుకున్న భారత అథ్లెట్లకు చేదు అనుభవం ఎదురైంది. అక్రిడిటేషన్లు ఉన్నప్పటికీ పలువురు క్రీడాకారులకు సకాలంలో వసతి గదులు కేటాయించలేదు. దీంతో 12 గంటలకు పైగా, కొందరు 14 గంటల వరకు గదుల కోసం వేచి చూడాల్సి వచ్చింది. ఈ సమయంలో ఆహారం కూడా అందుబాటులో లేకపోవడంతో అథ్లెట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొంది.
భారత రోయింగ్ బృందానికి చెందిన క్రీడాకారులు మంగళవారం ఢిల్లీ నుంచి రెండు బృందాలుగా జపాన్‌కు బయల్దేరారు. బ్యాంకాక్‌లో విరామం తర్వాత తొలి బృందం బుధవారం ఉదయం 8 గంటల సమయంలో నాగోయా చేరుకుంది. అక్కడి నుంచి గంట తర్వాత వసతి కోసం ఏర్పాటు చేసిన క్రూజ్ నౌక వద్దకు వెళ్లారు. అయితే గదులు సిద్ధంగా లేకపోవడంతో అక్కడే నిరీక్షించాల్సి వచ్చింది.
ఓ రోయర్ 'ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్'తో మాట్లాడుతూ.. ఉదయం 9 గంటలకు వసతి కేంద్రానికి చేరుకున్నామని, రాత్రి 8.30 గంటల సమయానికి కొద్దిమందికే గదులు లభించాయని తెలిపారు. గదులు పొందిన వారిని కూడా మరికొందరు క్రీడాకారులతో కలిసి ఉండాలని కోరినట్లు చెప్పారు.
రోయర్లే కాకుండా భారత షూటర్లు, మరో రెండు జట్లకు కూడా ఇదే పరిస్థితి ఎదురైనట్లు నివేదిక పేర్కొంది. షూటర్లకు కేటాయించిన వసతి కేంద్రాన్ని ఇతర దేశాల బృందాలకు ఇవ్వడంతో వారు మరో హోటల్‌లో బస చేయాల్సి వచ్చింది. భారత ఒలింపిక్ సంఘానికి చెందిన కొందరు సభ్యులను కూడా సమీపంలోని మరో హోటల్‌కు తరలించారు. వైద్య బృందం కూడా తాత్కాలికంగా వారితో కలిసి సర్దుకోవాల్సి వచ్చింది.
క్రీడాకారులు, బృందాల సంఖ్యను నిర్వాహకులు సరిగా అంచనా వేయకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తినట్లు నివేదిక పేర్కొంది. అందుబాటులో ఉన్న వసతిలో కొంత భాగాన్ని ఇతర దేశాల బృందాలకు కేటాయించడంతో భారత అథ్లెట్లకు గదుల కొరత ఏర్పడినట్లు తెలిపింది. ఆసియా క్రీడల ఆరంభానికి ముందే వసతి ఏర్పాట్లలో తలెత్తిన ఈ గందరగోళం భారత బృందాలకు ఇబ్బందికరంగా మారింది.

# హర్మన్‌ప్రీతే బెస్ట్ కెప్టెన్.. కెప్టెన్సీ మార్పుపై అంజుమ్ కీలక వ్యాఖ్యలు

- **భారత మహిళా జట్టు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కొనసాగాలన్న అంజుమ్ చోప్రా**
- **ప్రస్తుతానికి జట్టును నడిపించగల ఉత్తమ వ్యక్తి హర్మన్‌ప్రీతేనని స్పష్టీకరణ**
- **ఆసియా కప్‌లో ఫామ్‌లో లేకపోయినా తిరిగి పుంజుకుంటుందని ధీమా**
- **కెప్టెన్‌గా, బ్యాటర్‌గా ఆమె సేవలు జట్టుకు అవసరమన్న అంజుమ్**




ప్రజాక్షేత్రం :
భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్సీ మార్పుపై చర్చ జరుగుతున్న తరుణంలో, మాజీ కెప్టెన్ అంజుమ్ చోప్రా ప్రస్తుత సారథి హర్మన్‌ప్రీత్ కౌర్‌కు గట్టి మద్దతు తెలిపింది. ఇటీవలి కాలంలో బ్యాటింగ్‌లో రాణించకపోయినా, జట్టును నడిపించడానికి ఆమెనే సరైన వ్యక్తి అని స్పష్టం చేసింది.
ఇటీవల దుబాయ్‌లో జరిగిన టీ20 ఆసియా కప్‌ను భారత్ రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి గెలుచుకుంది. అయితే, ఈ టోర్నీలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ 5 మ్యాచ్‌ల్లో కేవలం 71 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచింది. దీనికి తోడు ఆమె వయసు 37 ఏళ్లు కావడంతో, వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు కెప్టెన్సీ అప్పగించాలనే వాదనలు వినిపిస్తున్నాయి.
ఈ నేపథ్యంలో 'టైమ్స్ ఆఫ్ ఇండియా'తో మాట్లాడిన అంజుమ్ చోప్రా, కెప్టెన్సీ మార్పుపై వస్తున్న చర్చలను తోసిపుచ్చింది. "ప్రస్తుతానికి భారత జట్టును నడిపించడానికి హర్మన్‌ప్రీతే ఉత్తమ కెప్టెన్. ఆమె బ్యాటింగ్ ప్రదర్శనపై విమర్శలు వస్తున్నాయి. కానీ, ప్రతిసారీ ఆమె నుంచి 2017 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాపై ఆడిన 171 పరుగుల వంటి ఇన్నింగ్స్‌ను ఆశించలేం" అని పేర్కొంది.
రాబోయే ఆసియన్ గేమ్స్, ఇతర సిరీస్‌లతో హర్మన్‌ప్రీత్ తిరిగి ఫామ్‌లోకి వస్తుందని అంజుమ్ చోప్రా ధీమా వ్యక్తం చేసింది. "ముఖ్యమైన టోర్నమెంట్ల నాటికి బ్యాట్‌తో రాణించడం ఎంత ముఖ్యమో ఆమెకు తెలుసు. కెప్టెన్‌గా, బ్యాటర్‌గా ఆమె సేవలు భారత జట్టుకు ఇంకా ఎంతో అవసరం" అని వివరించింది. 2027లో జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో ఉంచుకుని చూసినా, హర్మన్ నాయకత్వమే సరైనదని ఆమె అభిప్రాయపడింది.

# ఆమనగల్ డిగ్రీ కళాశాలలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

- **కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద శర్వాణి.**

**ఆమనగల్ సెప్టెంబర్ 18(ప్రజాక్షేత్రం):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన "తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం" పురస్కరించుకొని కళాశాల విద్యా కమిషనరేట్ ఆదేశాల మేరకు ఆమనగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రొఫెసర్ శ్రీపాద శార్వాణి అధ్యక్షతన చరిత్ర విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ నాటి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ అకుంఠితమైన దీక్ష, ధైర్య సాహసం, చతురతతో హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిన ప్రక్రియ (ఆపరేషన్ పోలో) అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. తెలంగాణ (హైదరాబాదు రాష్ట్ర) భౌగోళిక నేపథ్యం, చారిత్రక పరిణామ క్రమం ఆదిమయుగం నుంచి అసఫ్ జాహీల యుగం వరకు తెలియజేశారు. భారత స్వాతంత్ర ఉద్యమం పోరాటంలో తెలంగాణ ప్రాంతం పాత్రను వివరించారు. రెండు వందల సంవత్సరాల దోపిడీ, అణిచివేతకు నలభై ఏడు సంవత్సరాల తిరుగుబాటు, సాయుధ పోరాటం ఒక దశ మాత్రమే అని వారన్నారు. వివిధ సంఘాల పార్టీల, ప్రజాస్వామికవాదుల, రచయితల, ప్రజల సంఘటిత క్రమపరిణామ పోరాటమది అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మార్పీఎస్ శంకర్ పల్లి మండల కన్వీనర్ గా లింగం సాయి మాదిగ

- **శంకర్ పల్లి మున్సిపల్ కన్వీనర్ బడ్లగూడెం ప్రవీణ్ మాదిగ**

**శంకర్ పల్లి, సెప్టెంబరు 17(ప్రజాక్షేత్రం):**
ఎమ్మార్పీఎస్ శంకర్ పల్లి మండల కన్వీనర్ గా లింగం సాయి మాదిగ, కో కన్వీనర్ గా బోడ ప్రశాంత్ మాదిగ మున్సిపల్ కన్వీనర్ గా బండ్లగూడెం ప్రవీణ్ మాదిగ ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మార్పీఎస్ శంకర్ పల్లి మండల ఇన్చార్జి కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఫలాలు అర్హులకు అందేలా కృషి చేయాలని సూచించారు. మాదిగల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. అసమానతలు లేని సమాజ నిర్మాణమే ఎమ్మార్పీఎస్ లక్ష్యమన్నారు. అక్టోబర్ 7న అమరావతిలో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీల సమావేశం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బ్యాతల శివ శంకర మాదిగ, వివిధ గ్రామాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# అల్లు అర్జున్ 'రాకా' నుంచి క్రేజీ అప్‌డేట్..

గత కొన్ని నెలలుగా సైలెంట్‌గా షూటింగ్ జరుపుకుంటున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా మూవీ 'రాకా' నుండి ఫ్యాన్స్‌కు సర్‌ప్రైజింగ్ అప్డేట్ వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం నుంచి అప్డేట్స్ రావడం లేదని నిన్నటి వరకు ఫీలయ్యారు ఫ్యాన్స్.. దీంతో నేడు ఓ నెంబర్ పోస్టర్ వదలి.. దాన్ని ఎనలైజ్ చేయమని ఫ్యాన్స్ కే పరీక్ష పెట్టారు టీమ్. 'మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి' అనే ట్యాగ్ లైన్‌తో తాజాగా కేవలం '37' అనే సంఖ్య మాత్రమే ఉన్న ఒక విలక్షణమైన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మిస్టరీ నంబర్ పోస్టర్ ఇప్పుడు అల్లు అర్జున్ అభిమానులతో పాటు సినిమా లవర్స్‌ను సైతం ఆకర్షిస్తుంది. అసలు ఆ '37' కి అర్థం ఏంటా అని నెటిజన్లు జుట్టు పీక్కుంటున్నారు. దీనిపై రకరకాల ఊహాగణాలు వినిపిస్తుండగా.. మొత్తానికి ఆ '37' వెనుక ఉన్న అసలు రహస్యం ఏంటనేది త్వరలోనే వెల్లడి కానున్నది. ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో గ్లోబల్ బ్యూటీ దీపికా పడుకోనే హీరోయిన్‌గా నటిస్తుండగా.. యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ సంగీతాన్ని అందిస్తున్నాడు.




విక్టరీ వెంకటేష్ హీరోగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'ఆదర్శకుటుంబం'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ చిత్రం అక్టోబర్ 2న రిలీజ్ కాబోతున్నది. ఇప్పటికే ఈ మూవీ నుంచి వచ్చిన ప్రతీ అప్డేట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. తాజాగా వచ్చిన టీజర్‌తో సినిమాలో ఉన్న కామెడీ యాంగిల్‌ను పరిచయం చేశారు మేకర్స్. సాధారణ బ్యాంక్ ఎంప్లాయ్‌గా ఉండే వెంకీ.. తన భార్య అప్పల బాధ తట్టుకోలేక విలవిల్లాడతాడు. అలాంటి వ్యక్తికి లాడరీ తగిలితే ఎలా ఉంటుంది అనే యాంగిల్‌కు కామెడీ జోడించి అద్భుతంగా ప్రజెంట్ చేశాడు త్రివిక్రమ్. ఈ క్రమంలోనే ఈ సినిమాకు సంబంధించి తాజాగా మరో క్రేజీ అప్డేట్ నెట్టింట దర్శనమిచ్చింది. ఈ మూవీలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా.. నారా రోహిత్, నివేథా పేతురాజ్, యువినా పార్థవి, రాజా ప్రైవల్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ ప్రాజెక్టులో క్రేజీ అండ్ బోల్డ్ బ్యూటీ డింపుల్ హయాతి కూడా భాగం అయినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా.. ఈ మూవీలో ఓ స్పెషల్ సాంగ్ కూడా ఉండబోతుండగా.. అందులో డింపుల్‌తో పాటు నివేథా పేతురాజ్ కూడా కనిపించనున్నారని తెలుస్తోంది. అయితే.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



## స్పెషల్ సాంగ్‌లో డింపుల్.. వెంకీ మామా సినిమా నుంచి క్రేజీ అప్డేట్

# వచ్చే ఏడాదిలో 'జి2'

అడివి శేష్ కథానాయకుడిగా నటిస్తున్న 'జి2' వచ్చే ఏడాది ఫిబ్రవరి 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. విజయవంతమైన 'గూఢచారి'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమిది. వినయ్‌కుమార్ సిరిగినీడి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. వామికాగబ్బి కథానాయిక. టి.జి.విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మాతలు. ఇమ్రాన్ హష్మీ, మురళీశర్మ, మధుశాలిని కీలక పాత్రలు పోషిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రూపొందుతున్న ఈ సినిమా విడుదల తేదీని బుధవారం ప్రకటించారు నిర్మాతలు. తెలుగుతోపాటు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు తెలిపారు.



# వచ్చే ఏడాదిలో 'జి2'

సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' (Toxic Movie). యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా గురించి యశ్ మాట్లాడుతూ ఇది కేవలం పెద్దవాళ్ల సినిమా అని స్పష్టం చేశారు. ''పిల్లలు ఈ సినిమా చూడొద్దు. ఇది పెద్దల కోసం మాత్రమే తీశాం. ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాను. పెద్దలకు తప్పొప్పులు తెలుసు. వాళ్లు ఈ సినిమా నుంచి ఏం నేర్చుకోవాలో నిర్ణయించుకుంటారు. జీవితంలో ఏం చేయాలి, ఏం చేయకూడదనే విచక్షణ వారికి ఉంటుంది. అందుకే వాళ్ల కోసమే చాలా నిజాయతీగా ఈ చిత్రం రూపొందించాం'' అని చెప్పారు.




ఇందులోని అశ్లీల సన్నివేశాల గురించి యశ్ (Yash) మాట్లాడారు. విమర్శలను తోసిపుచ్చారు. 'ఈ చిత్రం మిమ్మల్ని ఆలోచింపచేస్తుంది. కథ నిర్దిష్టమైన దిశకు చేరుకోవాలంటే ప్రతి పాత్రలోని వేర్వేరు పొరలను ఆవిష్కరించడం చాలా ముఖ్యం. ట్రైలర్, పాటలపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవి కేవలం రెండు పాత్రల మధ్య ప్రేమను ఆవిష్కరించే సన్నివేశాలు మాత్రమే. వాటిని అలా మాత్రమే చూడండి. గీతూ మోహన్‌దాస్ ఒక దర్శకురాలు.. మహిళలకు కూడా భావోద్వేగాలు పంచుకునే హక్కు ఉంటుంది. కేవలం పబ్లిసిటీ కోసం కాకుండా, కథలోని ప్రాధాన్యతను బట్టే ఆయా సన్నివేశాలు చిత్రీకరించాం'' అని యశ్ అన్నారు.

మనం ఎదుగుతుంటే పక్కవారు చూడలేరంటూ ఓ ఇన్‌ఫ్లూయెన్సర్ పెట్టిన పోస్ట్‌కు నటి శోభితా ధూళిపాళ్ల (Sobhita Dhulipala) మద్దతు తెలిపారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే శోభితా.. తాజాగా ఒక పోస్ట్‌కు ఇచ్చిన రిప్లై వైరల్ అవుతోంది. 'మనకు మనమే శత్రువులం' అని తెలుగు వాళ్లను ఉద్దేశించి పెట్టిన వీడియోకు.. ఈ నటి 100 శాతం కరెక్ట్ అంటూ ఎమోజీతో రిప్లై పెట్టారు. ఈ సందర్భంగా తాను ఇండస్ట్రీకి రావాలనుకున్న రోజులను, అప్పుడు తనకు ఎదురైన అనుభవాలను శోభిత పంచుకున్నారు.

"16 ఏళ్ల వయసులోనే నా బ్యాగులు సర్దుకుని ముంబయికి వెళ్లిపోయా. నేను కచ్చితంగా ఈ రంగంలో రాణిస్తాననే నమ్మకం లేదు. అయినా.. ధైర్యంగా అడుగు ముందుకు వేశా. ఎందుకంటే మన సమాజంలో చాలా వరకూ కలలు కనేవారిని, ముఖ్యంగా కొత్తరంగంలోకి అడుగుపెట్టాలనుకునే వారిని ప్రోత్సహించరు. మనం కొత్తగా ఏదైనా పని మొదలు పెడితే.. అప్పటికే ఆ రంగంలో ఉన్నవాళ్లు మనకు మద్దతు ఇవ్వరు. ఈ విషయం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఇక, ఇలాంటి నూతన అడుగు వేసేది మహిళ అయితే.. ప్రతికూల పరిస్థితులు రెట్టింపు అవుతాయి" అని శోభిత తన రిప్లైలో రాసుకొచ్చారు.

దావూద్ ఇబ్రహీంతో ఫొటో.. నా కెరీర్‌ను దెబ్బతీసింది: నటి

అయితే.. ఇదంతా ఒకప్పటి పరిస్థితి అని శోభిత స్పష్టం చేశారు. "ఇది చాలా కాలం క్రితం జరిగింది. ఇప్పుడు పరిస్థితులు మారాయని ఆశిస్తున్నా. మన సమాజంలో అందరూ ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగాలి. ఇతరులపై ఆధారపడకుండా మీ కోసం మీరు నిలబడేంత మానసిక బలాన్ని పెంపొందించుకోవాలి" అని సూచించారు. 2016లో ఓ హిందీ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శోభితా.. గూఢచారి సినిమాలో సమీరాగా మెప్పించారు. మేజర్, పొన్నియన్ సెల్వన్‌లలో నటించారు. ఒకవైపు సినిమాలు చేస్తూనే వెబ్ సిరీస్‌లతో ఆకట్టుకుంటున్నారు.

# మనకు మనమే శత్రువులం



# నా ప్రపంచాన్ని మీ అందరికి పరిచయం చేయబోతున్నా అంటూ అప్డేట్ ఇచ్చిన దుల్కర్ సల్మాన్



బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో సందడి చేస్తున్న మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఆకాశంలో ఒక తార'. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన అప్డేట్స్ సినిమాపై అంచనాలను పెంచగా.. తాజాగా విడుదల తేదీని ప్రకటించాడు దుల్కర్. ఈ మేరకు ఓ స్పెషల్ పోస్టర్‌ను షేర్ చేస్తూ.. 'ఇప్పటివరకు ఈ ప్రయాణం ఎంతో అద్భుతంగా సాగింది.. నవంబర్ 20న ఈ ప్రపంచాన్ని మీ అందరికీ పరిచయం చేయడానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.. మీ, కృష్ణ' అంటూ సినిమా నవంబర్ 20న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు ప్రకటించాడు. కాగా.. అంతరిక్షంలోకి వెళ్లాలని పెద్ద కలలు కనే ఒక గ్రామీణ అమ్మాయి కథాంశంతో ఈ చిత్రాన్ని ఎంతో ఆసక్తికరంగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని సందీప్ గున్నం, రమ్య గున్నం లైట్ బాక్స్ మీడియా బ్యానర్‌పై నిర్మిస్తుండగా.. పవన్ సాధినేని దర్శకత్వం వహిస్తున్నాడు. సాత్విక వీరపల్లి హీరోయిన్. జి.వి ప్రకాష్ కుమార్ అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నాడు.

*బోనాల సమయంలో తాను ఎదుర్కొన్న విమర్శల గురించి నటి ఫరియా అబ్దుల్లా (Faria Abdullah) మరోసారి స్పందించారు. ఆమె తాజా చిత్రం 'సిగ్మా' విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఈ విషయం గురించి మాట్లాడారు. సోషల్ మీడియాలో ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయన్నారు.*

*"ఇటీవల సోషల్ మీడియాలో నాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అదే వేదికగా నేను కూడా ఆ వివాదంపై నా అభిప్రాయాన్ని తెలియజేశాను. అయితే, ఒక విషయం మాత్రం నన్ను వెంటాడింది. మనం 2026లో జీవిస్తున్నాం. కానీ, ఇంకా చాలామంది పాతకాలం వాళ్లలా ఆలోచిస్తున్నారు. ఆ సమయంలో కొందరి భావజాలం బాధించింది. నేనెప్పుడూ అభ్యుదయ భావాలతో ఆలోచిస్తాను. నా పద్ధతులు నచ్చిన వాళ్లు అనుసరిస్తారు. నచ్చని వాళ్లు విమర్శిస్తారు. ఎవరి అభిప్రాయాలు వాళ్లకు ఉంటాయి. అందరి ఆలోచనలను నేను గౌరవిస్తాను" అని చెప్పారు.*

*ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బోనాల సందడిలో ఫరియా అబ్దుల్లా.. పోతురాజుతో కలిసి నృత్యం చేశారు. ఆమె ఈ పండగ చేసుకోవడంపై కొందరు మతం పేరుతో విమర్శించారు. వీటిని ఖండించిన ఫరియా సోషల్ మీడియా వేదికగా నాడు వీడియో విడుదల చేశారు. తాను అంతటా భగవంతుడిని చూస్తానని అన్నారు.*

*ఇక, సిగ్మా విషయానికొస్తే.. తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ కథానాయకుడు విజయ్ కుమారుడైన జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిది. సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది.*

# మనం 2026లో ఉన్నాం..



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394